ప్రజాశక్తి
విశాఖపట్నం

సోమవారం
జనవరి 01
2018
12 పేజీలు



ఖాళీల కలత..



- ప్రభుత్వాస్పత్రుల్లో భర్తీ కాని పోస్టులు
- మెరుగుపడని వైద్య సదుపాయాలు
- వైద్యం అందక ఇక్కట్లు పడుతున్న పేదలు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

ప్రభుత్వం ఎన్ని మాటలు చెబుతున్నా ప్రభుత్వాస్పత్రుల్లో వివిధ స్థాయిల్లో సేవలందించాల్సిన ఖాళీలను భర్తీ చేయడం లేదు. ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రాథమిక, ఉప కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల్లో ఖాళీలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వాస్పత్రుల్లో ఖాళీలను భర్తీ చేసి మెరుగైన వైద్యసేవలందిస్తామని ప్రకటనలకు ఆచరణకు పొంతన ఉండడం లేదు. ప్రభుత్వాస్పత్రుల్లో రోగుల తాకిడి పెరుగుతున్నా ఆ మేరకు వాటిని ప్రభుత్వం అభివృద్ధి చేసి మెరుగైన వైద్య సేవల కల్పనకు ప్రయత్నం చేయడం లేదు. ఇప్పటికీ 527 పోస్టులు ఖాళీగా వున్నాయి.

జిల్లాలో 89 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 584 ఉప ఆరోగ్య కేంద్రాలు, 13 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఒక ఏరియా ఆస్పత్రి, ఒక జిల్లా ఆస్పత్రి, ఒక మెడికల్ కాలేజీ ఆస్పత్రి ఉన్నాయి. వీటిల్లో వివిధ స్థాయిల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఉప ఆరోగ్య కేంద్రాల్లో మొదలుకొని జిల్లా ఆస్పత్రుల వరకు ఖాళీలు దర్శనమిస్తున్నాయి.

జిల్లాలో రెండు సివిల్ సర్జన్, ఆరు సివిల్ సర్జన్ (స్పెషలిస్టులు), నాలుగు సివిల్ అసిస్టెంట్ సర్జన్ (మెడికల్ ఆఫీసర్లు), ఐదు పబ్లిక్‌హెల్త్ నర్సులు, 15 మల్టీ పర్పస్ హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్లు, ఎనిమిది స్టాఫ్‌నర్సులు, 18 మల్టీ పర్పస్ హెల్త్ సూపర్‌వైజర్లు(మగ), ఆరు మల్టీ పర్పస్ హెల్త్ సూపర్‌వైజర్లు (ఆడ), 13 ల్యాబ్ టెక్నీషియన్లు, 11 ఫార్మాసిస్టులు, 159 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు (మగ), 155 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు (ఆడ), 125 సెకెండ్ ఎఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మెరుగైన వైద్యసేవలందించాల్సిన వైద్య నిపుణుల నుంచి క్షేత్రస్థాయిలో రోగులకు సేవలందించగలిగే ఎఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్లు పోస్టుల వరకు ఎంతో కాలంగా ఖాళీగా ఉంటున్నాయి.

అలాగే 584 ఉప కేంద్రాల్లో 226 కేంద్రాలకు ప్రభుత్వ భవనాలున్నాయి. ఇంకా 358 ఉప ఆరోగ్య కేంద్రాలు ప్రయివేటు భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ప్రజలకు అందుబాటులో ఉండే ఈ కేంద్రాలకు శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టి ప్రాథమిక వైద్య సౌకర్యాల కల్పనకు సరిపడా మౌలిక సదుపాయాలు సమకూర్చడం లేదు. దీంతో ప్రభుత్వాసుపత్రిలో వైద్య సదుపాయాలు మెరుగుపడకపోవడంతో పేదలకు సరైన వైద్యం అందడం లేదు.



అంగన్‌వాడీ కేంద్రాల్లో 'కాస్'

నేటి నుంచి ఆన్‌లైన్‌లోనే వివరాలు నమోదు
అంగన్‌వాడీలకు భారం కానున్న విధానం

3లో

నూతనోత్సాహం

- ★ ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- ★ విందులు, వినోదాలతో యువత బిజీ
- ★ జనసంద్రమైన ఆర్కే బీచ్
- ★ గ్రామీణంలో కానరాని సందడి

నూతన సంవత్సర వేడుకలు విశాఖ జిల్లాలో హోరెత్తాయి. ఆనందోత్సాహాల నడుమ నూతన సంవత్సర సంబరాలు అంబరాన్నంటాయి. అర్ధరాత్రి 12 గంటలు దాటగానే యువత కేక్‌లు కట్ చేసి కేరింతలు కొట్టింది. బాణాసంచా పేల్చి ఆనందహేలలో మునిగితేలింది. బంధు మిత్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. నూతన సంవత్సరం సందర్భంగా ఉదయం నుంచే విశాఖలో సందడి నెలకొంది. బంధుమిత్రులకు శుభాకాంక్షలు తెలిపేందుకు పుష్పగుచ్ఛాలు, కేక్‌లు, స్వీట్లు కొనుగోళ్లతో ప్రధాన వాణిజ్య కేంద్రాలు కళకళలాడాయి. పిల్లల నుంచి వృద్ధుల వరకూ ఆనందోత్సాహాల మధ్య నూతన సంవత్సర సంబరాలు చేసుకున్నారు. నగరంలోని స్టార్ హోటళ్లలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కాగా గ్రామీణ ప్రాంతంలో ఇంతటి వాతావరణం కనిపించలేదు. గ్రీటింగ్ కార్డులు, కేక్‌లు కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని పోలీసుల హెచ్చరిక నేపథ్యంలో యువత రోడ్డు మీదకు పెద్దగా రాలేదు. అయితే మహిళలు ఇంటి ముందు రంగులతో ముగ్గులు వేసి కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలికారు.

▶ వార్తలు 4, సెంటర్ స్ప్రెడ్ పేజీల్లో...



విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో సందడి చేస్తున్న యువత

5 లక్షల పింఛన్ల మంజూరు

మంత్రి అయ్యన్న

8లో

ప్రజాస్వామ్యం అపహాస్యం

-2017లో విశాఖ భూ కబ్జాలు రాష్ట్ర వ్యాప్త సంచలనం
- పోలీసులంటే భయం పోవడం వల్లే నేరాలు పెరుగుదల
- వైసిపి నాయకులు బొత్స సత్యనారాయణ

4లో

నామమాత్రంగానే కొత్త ఓటర్ల నమోదు

కోటవురట్ల : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు డిసెంబర్ ఒకటి నుంచి నెలాఖరు వరకు చేపట్టిన ఓటర్ల జాబితా సవరణకు నామమాత్రంగానే స్పందన వుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఓటర్ల జాబితాలో ఉన్న పేర్లు సవరణ, తొలగింపులు పక్కన పెడితే, కొత్త ఓటర్ల నమోదు అంతంతమాత్రంగానే ఉందని అంటున్నారు. మండలంలో 46 పోలింగ్ బూతులపరిధిలో ఓటర్ల సవరణ ప్రక్రియ చేపట్టగా, కొత్తగా ఓట్ల నమోదుకు 468 దరఖాస్తులు రాగా, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు 29, ఓటర్ల తొలగింపులకు 69 దరఖాస్తులు వచ్చాయని రెవెన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ప్రభుదాస్ తెలిపారు. బిఎల్ఒలు సక్రమంగా ఓటరు నమోదు కేంద్రాల వద్దకు రాకపోవడం, దీనిపై సంబంధిత ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఓటర్ల జాబితా సవరణకు అంతంత మాత్రంగానే స్పందన వుందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రత్యేక ఓటర్ల నమోదును చేపట్టినప్పటికీ, దీనిపై ఆశించినస్థాయిలో ప్రచారం లేకపోవడం కూడా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ నామమాత్రం కావడానికి కారణమని పలువురు అంటున్నారు.

12వ రోజుకు రిలే దీక్షలు

పాడేరు రూరల్ : తొలగించిన తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లు చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి 12వ రోజుకు చేరుకున్నాయి. రోజులు గడుస్తున్నా అధికారుల్లో చలనం లేకపోడంతో జనవరి 2వ తేదీ నుంచి నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టేందుకు బాధిత ఆరోగ్య కార్యకర్తలు సంసిద్ధమవుతున్నారు. దీక్షలో ఎటువంటి సంఘటనలు జరిగినా అందుకు ఐటిడిఎ పిఒ, ఎడిఎం అండ్ హెచ్ఒ పూర్తి బాధ్యత వహించాలని ఆరోగ్య కార్యకర్తల సంఘం నాయకులు శెట్టి నాగరాజు, లక్ష్మణ్ అన్నారు.

హరిపాలెంలో వైద్యశిబిరం

అచ్యుతాపురం : సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన ఆదివారం హరిపాలెంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అనకాపల్లి చెందిన శ్రీ వివేకానంద ఛారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో డాక్టరు విష్ణుమూర్తి, కెవి సత్యవతి రోగులను పరీక్షించారు. 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జోన్ ఇన్‌ఛార్జి రామారావు, సభ్యులు పాల్గొన్నారు.

ములియగుడలో జియో టవర్ నిర్మాణం

అనంతగిరి: మండలంలోని వినియోగదారులకు ఎప్పటి నుంచే ఊరిస్తున్న జియో సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు టవర్ ఏర్పాటు పనులను ఆ సంస్థ శరవేగంగా ముగించింది. ఇప్పటికే కాశీపట్నంలో టవర్‌ను నిర్మించి సెల్ సిగ్నల్స్ అందించారు. ఇప్పుడు ములియగుడ గ్రామంలో కూడా సెల్ టవర్ నిర్మాణ పనులను జరిపి పూర్తిచేశారు. టోకూరు పంచాయతీ సిసగుడ గ్రామ సమీపంలో మరో టవర్ నిర్మాణానికి కూడా జియో సంస్థ యాజమాన్యం చర్యలు చేపట్టనున్నారు. జియో సేవలు అందుబాటులోకి వస్తే వినియోగదారులకు సెల్ సేవలు పూర్తిస్థాయిలో అందనున్నాయి.



పిచ్చిమొక్కల మధ్య రక్షణలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ప్రమాదభరితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి-అరకు రూరల్

అరకులోయ జిసిసి కార్యాలయం ఎదురుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచెను ఏర్పాటుచేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. నిత్యం ఈ మార్గంలో చిన్నారులు, మూగజీవులు వచ్చిపోతుంటాయి. ఈ మేరకు అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచెను ఏర్పాటుచేసి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గజగజలాడుతున్న 'గిరి'జనం




పొగమంచులో వారపుసంతకు వెళ్తున్న గిరిజనులు

గణనీయంగా తగ్గిన ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి-పాడేరు

విశాఖ మన్యాన్ని మంచు తీవ్రంగా కమ్మేస్తోంది. దీంతో అధిక సంఖ్యలో మన్యాన్ని సందర్శిస్తున్న పర్యాటకులు విపరీతంగా కురుస్తున్న మంచుతో ఇబ్బందులు పడుతున్నారు. మంచు, చలిదెబ్బకు మన్యవాసులు కూడా దైనందిన జీవితంలో అనేక అగచాట్లకు గురౌతున్నారు. తెల్లవారుజాము నుంచే మంచు కురుస్తుండడంతో మన్యవాసులు వారి నిత్యకృత్యాలు తీర్చుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చలికి తట్టుకోలేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఉదయం పది గంటల వరకు దర్శనమివ్వని సూర్యుడుతో పాటు సాయంత్రం మూడు గంటల నుంచే చలి గాలులు తీవ్రంగా వీస్తుండడంతో మన్యవాసులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. చలి నుంచి ఉపశమనం పొందేందుకు ఉన్ని దుస్తులు ధరించడంతో పాటు చలి మంటలను ఆశ్రయిస్తున్నారు. కొంతమంది రాత్రి వేళల్లో మంచాల కింద కుంపట్లు ఏర్పాటు చేసుకుని చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు. మంచు విపరీతంగా కురుస్తుండడంతో చిన్నారులు ఉదయాన్నే పాఠశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



చలిమంటతో ఉపశమనం పొందుతున్న మన్యవాసులు

పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం

పాడి పశువులకు మెరుగైన పోషక విలువలు సమకూర్చే దాణాను మండల అధ్యక్షులు చేకూరి శ్రీనివాసరావు చేతులు మీదగా ఆదివారం మండల కేంద్రంలో దోసూరు గ్రామానికి చెందిన 16 మంది రైతులకు పంపిణీ చేశారు. ఒక్కొక్క రైతుకు 480 కేజీల చొప్పున అందజేశామని, ఇది క్షీర సాగర పథకంలో వచ్చిందని తెలిపారు. సైలేజ్ గడ్డి 50 టన్నులు సరఫరా చేస్తున్నామని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎ.రామచంద్రరావు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు రాజాన రమేష్‌కుమార్, జెడ్‌పిటిసి సభ్యులు జనపరెడ్డి శ్రీనివాసరావు, తహశీల్దార్ రవికుమార్, దోసూరు పశువైద్యాధికారి ప్రియాంక, సర్పంచి లాలం నాగేశ్వరరావు, నాయకులు బి.రాందాస్, మెరుగు బాపునాయుడు, తమరాన తాతబాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.



పశుదాణా పంపిణీ చేస్తున్న ఎంపిపి శ్రీనివాసరాజు

బొర్రా గుహలకు పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి-అనంతగిరి

మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహల్లో ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. విదేశీ, స్వదేశీ పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో బొర్రాగుహలు కిక్కిరిసింది. సెలవు రోజు కావడంతో పర్యాటకుల తాకిడి పెరగడంతో పర్యాటక శాఖకు టిక్కెట్ల రూపేణా అధికంగా ఆదాయం వచ్చింది. వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు స్థలం లేక దారి పొడవునా వాహనాలను రహదారి పక్కన నిలిపివేశారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

బొర్రాతో పాటు కటికి, తాడిగుడ, కాఫీ ప్లాంటేషన్, డముకు వ్యూ-పాయింట్ వద్ద కూడా పర్యాటకులు సందడి చేశారు. 2017 సంవత్సరానికి గుడ్‌బై చెబుతూ, నూతన సంవత్సరాన్ని ఆహ్వానించేందుకు అధికసంఖ్యలో యువత సందర్శిత ప్రాంతాలకు చేరుకున్నారు.

చాపరాయిలో పర్యాటకుల సందడి

డుంబ్రిగుడ : మండలంలోని పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం వద్దకు ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో పర్యాటకులతో జలపాతం సందడిగా మారింది. చాపరాయిలో స్నానాలు చేస్తూ, వనభోజనాలు చేస్తూ ఆనందంగా గడిపారు.

పారిశుధ్య నిర్మూలనకు అధిక ప్రాధాన్యత



డస్ట్‌బిన్‌లను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ అనిత

మున్సిపల్ ఛైర్‌పర్సన్ అనిత

ప్రజాశక్తి-నర్సీపట్నం

మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్మూలనకు ప్రాధాన్యతనివ్వాలని నర్సీపట్నం మున్సిపల్ ఛైర్‌పర్సన్ చింతకాయల అనిత అన్నారు. ఆదివారం తడి, పొడి చెత్త సేకరణకు వేర్వేరుగా కొత్తడస్ట్‌బిన్‌లను స్థానిక సరగమ రెస్టారెంట్‌లో ప్రారంభించారు. వీటిని పలువురు దాతలు సమకూర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛ అవార్డు సాధించే దిశగా మున్సిపల్ అధికారులు కృషి చేస్తున్నారన్నారని, వారికి అందరూ సహకరించాలన్నారు. మూడోసారి కూడా ఉత్తమ ఒడిఎఫ్ మున్సిపాలిటీగా నర్సీపట్నం ఎంపికకావడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. మున్సిపాలిటీలో అనేక రోడ్లు నిర్మాణ పనులు జరుగుతున్నాయని, 15వ వార్డులో రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, కౌన్సిలర్ చెరుకూరి సత్యనారాయణ, నవ్య లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు, వార్డు ప్రజలు, రెస్టారెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.


పింఛను కోసం వికలాంగుని ఎదురుచూపులు

పలు జన్మభూమిల్లో వేడుకున్నా స్పందన లేదని ఆవేదన

ఈ సారైనా కరుణించాలని వేడుకోలు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు

తనకు అంగవైకల్యం వచ్చిన దానికన్నా, వికలాంగ పింఛను కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందనే మనోవేదన తీవ్రంగా కలిచివేస్తోందని ఒక వికలాంగ బాలుడు ఆదివారం స్థానిక విలేకర్ల వద్ద తనగోడును వెళ్లబోసుకున్నాడు. మండలంలోని మారుమూల కుమడ పంచాయతీ సిర్లిమెట్ట గ్రామానికి చెందిన కిల్లో రాము (10) అనే గిరిజన బాలుడు పుట్టుక నుంచి వికలాంగుడు. ఐదేళ్లుగా పింఛను మంజూరు చేయాలని ప్రభుత్వం చేపట్టే జన్మభూమి కార్యక్రమంలో పలుమార్లు అర్జీలు పెట్టుకున్నా ఫలితం లేదన్నాడు. మండల కేంద్రానికి వచ్చి ఎంపిడిఒ కార్యాలయంలో దరఖాస్తులు పెట్టుకున్నానని, అయినా అధికారులు కరుణించలేదని వాపోతున్నాడు. తండ్రి చనిపోవడంతో తల్లే ఆలనా, పాలనలో కాలం వెల్లదీస్తున్నానని, తల్లి రోజువారీ కూలితోనే కుటుంబపోషణ గడుస్తుండడంతో వికలాంగుడినైన తనను సాకేందుకు తన తల్లి ఆర్థికంగా నానా ఇబ్బందులకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశాడు. వికలాంగుడినైన తనకు పింఛను వస్తే, తనకు, తన కుటుంబానికి ఆర్థిక ఆసరా ఉంటుందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు పింఛను మంజూరు చేయాలని రాము కోరుతున్నాడు.



కిల్లో రాము

వ్యాపార విస్తరణకు అచ్యుతాపురం అనుకూలం

విఎస్ఇజెడ్ డెవలప్‌మెంట్ కమిషనర్ శోభన

ప్రజాశక్తి-అచ్యుతాపురం

పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం వ్యాపార విస్తరణకు అనుకూలమని విఎస్ఇజెడ్ డెవలప్‌మెంట్ కమిషనర్ శోభన కెవిఎస్‌రావ్ చెప్పారు. అచ్యుతాపురంలో ఆదివారం విశాఖ కోపరేటివ్ బ్యాంకు 49వ శాఖను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సెజ్‌లో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయన్నారు.

బ్యాంకు మాజీ ఛైర్మన్ మానం ఆంజనేయులు మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకులు ధనికులకు రుణాలిచ్చి మరింత కుబేరులను చేస్తున్నాయని తెలిపారు. బ్యాంకు ఛైర్మన్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకులకు దీటుగా కోపరేటివ్ బ్యాంకు నడుస్తుందన్నారు. ఈ సందర్భంగా ది సిటీ జన కోపరేటివ్ ఎమ్‌డి కె.వెంకట సుబ్బయ్య కోటి రూపాయలు డిపాజిట్ చేస్తూ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సభ్యులు పాల్గొన్నారు.

శరవేగంగా రక్షణ గోడ నిర్మాణం

ప్రజాశక్తి - మాడుగుల

మండల కేంద్రంలోని మోదమాంబ కాలనీ వాసుల కోరిక నెర వేరనుంది. కాలనీకి వెళ్లే దారిలో స్థానిక బాలికల వసతి గృహం వద్ద రహదారి ఎత్తుగా ఉండి, రెండవ వైపు 10 అడుగుల పల్లం ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. రోడ్డు ఇరుకుగా ఉండటంతో పాటు ఎడమవైపు పల్లంగా ఉండటంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు భయాందోళన వ్యక్తం చేసేవారు. దీంతో నాలుగు లక్షలను మండల పరిషత్ నిధులు కేటాయిం చడంతో ఎంపిపి ఓంద్రు గంగమ్మ, వైస్ ఎంపిపి పెరుమాళ్ల వెంకటరావులు రక్షణగోడ నిర్మాణ పనులను శరవేగంగా చేపడుతున్నారు. 4లక్షలతో సగం వరకే గోడ పూర్తి కావడంతో మరో 6లక్షలు విడుదల చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇదేవిధంగా మండల పరిషత్ నిధులతో గ్రామంలో వివిధ రహదారులు నిర్మాణ మవుతున్నాయి. స్థానిక ఉబ్బలింగేస్వామి దేవాలయం, జవ్వాదిగెడ్డ, కర్రివాని కళ్లాలు, జనపరెడ్డి నివాస ప్రాంతం, జాగానివీధి, నూకాలమ్మ కాలని, బ్రహ్మంగారి దేవాలయం రహదారి, నెయ్యిల వీధి, మోదమాంబ కాలనీలో రూ.13లక్షలతో సిసి రహదారులు, లక్షా 50వేలతో మూడు బోర్లను నిర్మిస్తున్నారు.



నిర్మాణంలో ఉన్న రక్షణ గోడ



పంపిణీ చేస్తున్న నాయకులు

చంద్రన్న బీమా పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట

మండలంలో పెదపూడి శివారు పంగిడిలో ప్రభుత్వం మంజూరు చేసిన చంద్రన్న బీమాను బాధిత కుటుంబానికి స్థానిక సర్పంచ్ సారిపిల్లి రాము, ఎంపిటిసి రుత్తల రాము, గొకివాడ కోటేశ్వరరావు తదితరుల ఆదివారం అందజేసారు. గ్రామానికి చెందిన లాలం కన్నబాబు ఇటీవల మృతి చెందడంతో ప్రభుత్వం రూ2 లక్షలు మంజూరు చేసింది. ఈ కార్యక్రంలో నాయకులు గోకివాడ బలరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'కాస్'

నేటి నుంచి ఆన్‌లైన్‌లోనే వివరాలు నమోదు
అంగన్‌వాడీలకు భారం కానున్న విధానం

ప్రజాశక్తి-కొత్తకోట

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'కాస్' విధానం ఈనెల 1 నుంచి అమలు కానుంది. అరకొర వేతనంతో బండెడు పని భారంతో చాకిరీ చేస్తున్న అంగన్‌వాడీలకు ఆన్‌లైన్ యాప్ మరింత భారం కానుంది. ఆ శాఖలో కొత్తగా కామన్ అప్లికేషన్ సాఫ్ట్‌వేర్ (కాస్) ఆన్‌లైన్ సేవలు ప్రవేశ పెట్టారు. ఇప్పటికే కేంద్రాల నిర్వహణతో పాటు క్లస్టర్ సమావేశాలు, ప్రభుత్వం అప్పగించే ఓటర్ల నమోదు, బిఎల్ఓ సర్వే తదితర పనులు చేస్తూ పలు ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా కేంద్రాల నిర్వహణకు సంబంధించి సమగ్ర నివేదిక తయారీకి ఎంతో సమయం పడుతోంది. పని భారం ఎక్కువై సతమతం అవుతున్న తరుణంలో ఆన్‌లైన్ విధానం మరింత భారంగా మారనుంది. కాస్ యాప్‌తో ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి ఐడీ, పాస్ వర్డ్ జారీ చేయనున్నారు. ఉదయం కేంద్రం తెరిచే సమయంతో పాటు సాయంత్రం కేంద్రం మూసివేసే సమయం పిల్లల హాజరు, బాలింతలు, గర్భిణీలకు మోనూ, చిన్నారులకు ఆట పాటలు, రోజూ వారి రికార్డుల నిర్వహణ వంటి అంశాలను ఎప్పటికప్పుడు ఫొటోలు తీసి యాప్‌లో ఆప్‌లోడ్ చేయాలి. ఏ రోజు కారోజు తీస్తున్నారా? లేక పాత పోటోలే పెడుతున్నారా అనే ఆంశాలను కూడా ఆ యాప్ ద్వారా స్పష్టంగా తెసులుకునే అవకాశం ఉంది. దీంతో కార్యకర్తలకు పని భారం మరింత పెరిగే అవకాశం ఉంది.



అంగన్‌వాడీ కేంద్రంలో బోధిస్తున్న కార్యకర్త

నేటి నుంచి అమలు

జనవరి 1నుంచి ఈ విధానం అమలుకు చర్యలు చేపట్టినట్లు సిడిపిఒ వి.మంగతాయారు చెప్పారు. ఇప్పటికే ప్రతి కార్యకర్తకు ట్యాబ్‌లను అందించడమే కాక పని చేసే విధానం, ఆప్ లోడ్ నిర్వహణ పై క్లస్టర్, శాఖల వారీగాను పలుమార్లు శిక్షణ ఇచ్చామని తెలిపారు. కొంత మంది అవగాహన లేని కార్యకర్తలను గుర్తించి వారికి ప్రత్యేకంగా ఎక్కువ సమయం కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. ఈ యాప్ అమలుకు అంతా సిద్ధం చేసామన్నారు. ఈ యాప్ నిర్వహణతో పని సులభతరంగా ఉంటుదని తెలిపారు.

4న రక్తదానశిబిరం

ప్రజాశక్తి - చోడవరం

స్థానిక ప్రేమసమాజంలో ఈనెల 4న రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. స్త్రీ, పురుషులు రక్తదానం చేయవచ్చునని వారు పేర్కొన్నారు. స్థానిక విశ్వనాథ్ టైప్ ఇన్‌స్టిట్యూట్, ఫోరం ఫర్ ది బెటర్, ప్రభుత్వ, ప్రయి వేటు కాలేజ్‌లు, అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

సినిమా... సినిమా



అనకాపల్లి	
సత్యనారాయణ స్ర్కీన్ 1	హలో
సత్యనారాయణస్ర్కీన్ 2	మళ్లీరావా
రామచంద్ర	ఆక్సిజన్
పర్తిసాయి	ఎంసిఎ
షిర్డిసాయి	సీత
రాజా	ఒక్క క్షణం
వెంకటేశ్వర	సప్తగిరి ఎల్ఎల్‌బి
చోడవరం	
సాయిలక్ష్మి	- ఎంసిఎ
శ్రీసాయిలక్ష్మి	- హలో
సాయిసిరిమేక్స్	- దేవిశ్రీప్రసాద్
పూర్ణ	-మళ్లీరావా..
నర్సీపట్నం	
శ్రీకన్య :	: జవాన్
కన్య:	: లచ్చి
కన్యమినీ:	: రాజా ది గ్రేట్
సాయిశ్రీకన్య:	: 10
రాజు మూవీమేక్స్:	: సీత రాముని కోసం
బంగార్రాజు	: సప్తగిరి ఎల్ఎల్‌బి

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి

స్థానిక ఉషోదయ డిగ్రీ కళాశాలలో నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం 2018 క్యాలెండర్‌ను కళాశాల కరస్పాండెంట్‌లు పి.వెంకట రమణ, వి.అప్పలనాయుడు ఆవిష్కరించారు. అధ్యాపకులకు నూతన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్‌లు మాట్లాడుతూ, 2018 సంవత్సరంలో అందరికీ మంచి చేకూరాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.



దేవరాపల్లిలోఆవిష్కరిస్తున్న కరస్పాండెంట్లు



బుచ్చెయ్యపేటలో ఆవిష్కరిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట :

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తరాన త్రినాథ్ డిమాండ్ చేశారు. మండలంలో బంగారుమెట్ట యుపి స్కూల్‌లో ఎపిటిఎఫ్ మండలశాఖ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, బకాయి డిఎలను చెల్లించాలని, పిఆర్‌సి అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అయ్యన్న, దేముడు బాబు. జిటికె మూర్తి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని ములకలుపల్లి గ్రామంలో ఈ నెల 25న చోటు చేసుకున్న చోరీ కేసును స్థానిక పోలీసులు చేధించారు. ఎస్ఐ నర్సింహమూర్తి కథనం మేరకు.... గ్రామానికి చెందిన కొప్పాక ఈశ్వరరావు, తన సోదరుడు సన్యాసినాయుడు ఇళ్లలో జరిగిన చోరీలో 3 తులాల బంగారం, 25 తులాల వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు చోరీకి పాల్పడిన శిరికి విజయ్‌కుమార్‌ను అరెస్టు చేసి అతడి నుంచి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కె.కోటపాడు మండలం పాశిలపానిపాలెం గ్రామానికి చెందిన వాడని ఎస్ఐ పేర్కొన్నారు. గతంలో కూడా విజయ్‌కుమార్ పలు దొంగతనాలు చేశాడని చెప్పారు.



నిందితుడితో ఎస్ఐ నర్సింహమూర్తి

షార్ట్ సర్క్యూట్‌తో క్రషర్ దగ్ధం

ప్రజాశక్తి- మునగపాక

మండలంలో తిమ్మరాజుపేట గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున షార్ట్ సర్క్యూట్‌తో క్రషర్ దగ్ధమైంది. భీమిశెట్టి లచ్చ మాణిక్యాలకు చెందిన క్రషర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పులు చెరరేగి చెరుకు పిప్పికి వ్యాపించాయి. దీంతో, చెరుకు పిప్పి, వరి కుప్పలు, బెల్లం పాక కాలిబూడిదయ్యాయి. సుమారుగా రూ.2లక్షల ఆస్థినష్టం నష్టం కలిగి ఉంటుందని అంచనా.



దగ్ధమైన క్రషర్

కళాకారుడు మృతి

ప్రజాశక్తి - మాడుగుల

మండలకేంద్రానికి చెందిన కళాకారుడు పిట్ల సాయికుమర్ తూర్పుగోదావరి జిల్లాలోని కిర్లంపూడిలో మృతి చెందారు. సాంఘిక నాటకాలకు విశేషమైన స్పందన ఉండే రోజులలో రాజాజీ ఆర్ట్స్ క్రియేషన్ తరపున ఆయన అనేక నాటకాలలో కథా, ప్రతినాయుకునిగా నటించారు. సినీ రికార్డింగ్ డ్యాన్స్‌లలోనూ ఆయన మంచి ప్రతిభ కనబరిచారు. ఉపాధి నిమిత్తం గత కొన్ని సంవత్సరాలుగా ఆయన కిర్లంపూడిలో నివాసం ఉంటున్నారు. సాయికుమార్ మరణం పట్ల గ్రామానికి చెందిన పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - రావికమతం

సోమవారం జరిగే నూతన సంవత్సర వేడుకల్లో ఎటువంటి అల్లర్లకు పాల్పడినా చర్యలు తప్పవని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఆదిరాత్రి పూర్తి నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పూర్తి స్థాయిలో నిఘా ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో పండుగ సందర్భంగా కోడి పందాలు, పేకాటలు ఆడితే చర్యలు తప్పవ న్నారు. నేరాలు చేసిన వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎస్ఐ



తప్పిపోయిన యువకులతో పోలీసు, నేవీ అధికారులు

ట్రెక్కింగ్‌లో అపశృతి

-కొండొక్కిన ఆరుగురు యువకులు మిస్సింగ్
-రెండు హెలికాప్టర్లతో గాలించి పట్టుకున్న నేవీ సిబ్బంది
-ఊపిరిపీల్చుకున్న అధికార యంత్రాంగం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

నగరంలోని సీతమ్మధార సమీపంలోని సింహాచలం కొండ పైకి ట్రెక్కింగ్ నిమిత్తం సుమారు 20 మంది యువకులు వెళ్లారు. ఇందులో 14 మంది తిరిగి కిందకు వచ్చేయగా మిగిలిన ఆరుగురు దారి తప్పిపోయారు. దీంతో వారు మిగిలిన స్నేహితులకు ఫోన్‌చేశారు. తాము దారితప్పిపోయామని ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతున్నామని సమాచారమిచ్చారు. అప్పటికే కిందికి వచ్చేసిన స్నేహితులు ఈ సమాచారాన్ని పోలీసులకు అందించారు. డిసిపి ఫకీరప్ప ఆధ్వర్యాన పోలీసులు నేవీ అధికారుల సహకారంతో హెలికాప్టర్‌పై గాలించారు. వారితో పాటు వుడా వీసీ పట్నాల బసంత్‌కుమార్ కూడా హెలీటూరిజానికి కేటాయించిన పవన్ హెన్స్ హెలీకాప్టర్‌పై సింహాచలం కొండను గాలించారు. చివరికి ఆరుగురు యువకులను గుర్తించి సురక్షితంగా కిందకు దించారు. దీంతో పోలీసులు, నేవీ, అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకున్నారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం

-2017లో విశాఖ భూ కబ్జాలు రాష్ట్ర వ్యాప్త సంచలనం
-పోలీసులంటే భయం పోవడం వల్లే నేరాలు పెరుగుదల
- వైసిపి నాయకులు బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజాస్వామ్యం అపహాస్యమైందని వైసిపి సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ ఆరోపించారు. జగదాంబ కూడలిలోని వైసిపి కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2017లో విశాఖలో భూ కబ్జాలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించాయన్నారు. వీటిని కప్పి పుచ్చుకోవడానికి ఎన్ని విశాఖ ఉత్సవ్‌లను నిర్వహించినా విశాఖ ఇమేజ్ పెరగదని స్పష్టం చేశారు. సిట్ దర్యాప్తు ముగిసినట్లు పత్రికల్లో వచ్చిందని కచ్చితంగా దర్యాప్తులో ఉన్న నిందితుల పేర్లను బహిర్గతం చేసి శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా ఈ నివేదికను ప్రభుత్వం ముందు పెడితే నిందితులన బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు డిమాండ్ చేసే నాయకులు తెలుగుదేశం పార్టీలో ఉన్నారన్నారు. అటువంటి వారికి అవకాశం ఇవ్వకుండా సిట్ నివేదికను విశాఖలో బహిర్గతం చేయాలని కోరారు. 2018లోనైనా ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేసి మంచి పాలనను అందించాలని సూచించారు. ప్రభుత్వంతో పాటు పత్రికలు కూడా ప్రజా స్వామ్యాన్ని కాపాడటంతో కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రత్యేక హోదా విషయంలో కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం లాలూచీ పడటంతోనే ప్రత్యేక ప్యాకేజీను అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారనీ, ప్రత్యేక హోదా కోసం నిరంతర పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు. ముఖ్యంగా విశాఖకు రైల్వే జోన్ చిరకాల వాంఛన్నారు. కచ్చితంగా జోన్ సాధనకు పోరాటం చేస్తామని చెప్పారు. ఇటీవల ఢిల్లీలో రైల్వే శాఖ మంత్రిని వైసిపి ఎంపీలు కలిసి విశాఖ జోన్ గురించి చర్చించారన్నారు. కాగా ఎప్పుడూ లేని విధంగా రాష్ట్రంలో తొలిసారి ప్రతి పక్షం లేకుండా శాసన సభను నిర్వహించడం దురదృష్టమన్నారు. తమ డిమాండ్స్ పరిష్కరించే వరకూ అసెంబ్లీలో తమ ఎమ్మెల్యేలు అడుగు పెట్టరని స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ 22 మంది తమ పార్టీ ఎమ్మెల్యేలను టిడిపి ప్రభుత్వం మోసపూరితంగా ఆహ్వానించడం సిగ్గుచేటన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు నలుగురికి మంత్రి పదవులు కట్టబెట్టడం బాధాకరమని పేర్కొన్నారు. పోలీసులను కూడా చేతిలో పెట్టుకుని చట్టాన్ని ఇష్టానుసారంగా మార్చేస్తున్నారని ఆరోపించారు. దీంతో పోలీసులంటే భయం పోవడం వల్లే నగరంలో హత్యలు పెరిగిపోయాయన్నారు. సాయంత్రం పూట వేలాది మంది తిరిగే ద్వారకా బస్సు స్టేషన్ సమీపంలో ఒక యువకునిపై హత్యాయత్నమే దీనికి తార్కాణమని పేర్కొన్నారు. కేటాయించిన నిధులు ఖర్చుపెట్టకుండా మింగేస్తున్న ప్రభుత్వాన్ని నిలదీసిన దళితులపై దాడులు అమానుషమన్నారు. ముఖ్యంగా పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెంలో దళిత మహిళను వివస్త్రను చేసి దాడి చేయడం సిగ్గుచేటన్నారు. నూతన సంవత్సరంలోనైనా ఇటువంటి దారుణాలకు ఒడిగట్టకుండా పాలించాలని కోరారు. రాష్ట్రానికి పోలవరం జీవననాడనీ, దీన్ని 2004లో కీర్తిశేషులు వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రారంభించారనీ అటువంటి ప్రాజెక్టును తానే ప్రారంభించానని, తన జీవితాశయం ఆ ప్రాజెక్టు అని చంద్రబాబు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. ప్రాజెక్టు గుత్తేదార్లతో కుమ్మక్కై నిధులు దోచుకుంటున్నారని ఆరోపించారు. టిడిపి వచ్చి నాలుగేళ్లవుతున్నా ఇంత వరకూ ఒక్క నూతన ప్రాజెక్టును కూడా తీసుకురాలేకపోయారని విమర్శించారు. అనంతరం అందరికీ 2018 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి అనకాపల్లి పార్లమెంటు అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, విశాఖపట్నం పార్లమెంటు అధ్యక్షులు తైనాల విజయ్‌కుమార్, నాయకులు కరణం ధర్మశ్రీ, వి.కల్యాణి, తిప్పల నాగిరెడ్డి, కోల గురువులు, గరికిన గౌరి, పసుపులేటి ఉషాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

అంబరాన్ని తాకిన సంబరాలు

2018కి స్వాగతం పలుకుతూ
యువత కేరింత
విపరీతంగా మద్యం అమ్మకాలు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

విశాఖ జిల్లాలో కొత్త సంవత్సర వేడుకలు అంబరాన్ని అంటాయి. డిసెంబరు 31 ఆదివారం కావడంతో యువతకు, ఉద్యోగులకు కలిసిరావడంతో ఆదివారం మధ్యాహ్నం నుండే సంబరాల్లో మునిగితేలారు. ఫోన్లలో మెసెజ్‌లు, వాట్సాప్‌లు, మెయిల్స్ ద్వారా పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకోవడం మొదలెట్టారు. ఐదు, మూడు, రెండు నక్షత్రాల హోటళ్లలో సంపన్న వర్గాల నుంచి మధ్య తరగతి వరకూ ఎంజాయ్ చేశారు. డిజెలు, ప్రముఖ యాంకర్స్‌తో హోటళ్ల యాజమాన్యాలు ఆకట్టుకున్నాయి. ఎంట్రీ ఫీజు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేశాయి. వాల్తేరు, సెంచరీ, ఆఫీసర్స్, కంట్రీ క్లబ్‌లు పబ్‌లను తలపించాయి. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మందుబాబులు పూటుగా మద్యం తాగారు. మధ్యాహ్నం నుండే మద్యం షాపులు కిటకిటలాడాయి. కొంత మంది ఇళ్ల వద్ద పార్టీలు చేసుకోగా మరికొందమంది చిన్న హోటళ్లు, బార్లలో మునిగితేలారు. మహిళలు, చిన్నారులు తమ ఇళ్ల ముందు ముగ్గులతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రంగవల్లులు వేశారు. అర్ధరాత్రి వరకు టీవీ ఛానళ్లకు అతుక్కుపోయారు.



బీచ్‌లో కేరింతలు కొడుతున్న యువతీ యువకులు



స్టార్ హోటల్‌లో డ్యాన్స్‌లు వేస్తున్న యువతీ యువకులు





స్టార్ హోటల్‌లో క్యాట్ వాక్ చేస్తున్న మోడల్స్

కిక్కిరిసిన బీచ్

ఆర్కే బీచ్ జనంతో కిక్కిరిసింది. అర్ధరాత్రి వరకు యువత పెద్ద ఎత్తున బీచ్‌లో హంగామా చేసింది. పలువురు మందు పార్టీలు చేసుకున్నారు. స్పెన్సర్‌లో మద్యం కోసం క్యూ కట్టారు. అతి ఖరీదైన మద్యం అక్కడ ఎమ్మార్పీ ధరకే అమ్మడమే ఈ రద్దీకి కారణం. అంబికా సీ గ్రీన్ హోటల్, పామ్‌బీచ్, పార్కు హోటల్, నోవాటెల్, తాజ్ గేట్‌వేలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వినూత్నమైన సంగీత కార్యక్రమాలతో హోరెత్తాయి. అర్ధరాత్రి 12 గంటలు కాగానే 2018కి స్వాగతం పలుకతూ హోటళ్ల వద్ద పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చారు.

పోలీసు ఆంక్షలు

నూతన సంవత్సరం పేరుతో మందుబాబులు మద్యం తాగి రోడ్లపై రెచ్చిపోయే అవకాశం ఉన్నందున పోలీసులు పలు అంక్షలు విధించిన సంగతి తెలిసిందే. రాత్రి 10 గంటల తర్వాత రోడ్లపై పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు చేశారు. పలువురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు బుక్ చేశారు. పోలీసుల ఆంక్షలకు బయపడిన కొంతమంది ఇళ్ల వద్దే పార్టీలు చేసుకున్నారు.

నేటి మీ కోసం ప్రజావాణి రద్దు

ప్రజాశక్తి-జిల్లాపరిషత్

కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదులు స్వీకరించేందుకు సోమవారం నిర్వహించనున్న మీకోసం ప్రజావాణి, డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాలను రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2వ తేదీ నుండి జన్మభూమి మా ఊరు కార్యక్రమం ఉన్నందున మండల అధికారులతో సమీక్షించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ కారణంగా జనవరి 1న ఫిర్యాదులను స్వీకరించే కార్యక్రమం రద్దు చేశామని, దీనిని ప్రజలు గమనించాలని కోరారు.

నేడు పద్యనాటక పోటీలు

కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఉత్తరాంధ్ర పౌరాణిక పద్యనాటక కళాకారుల సంక్షేమ సేవా సంఘ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కళాభారతి ఆడిటోరియంలో ఏకపాత్రాభినయ పోటీలు, యుద్ధ సన్నివేశాల ప్రదర్శన ఉంటుందని సంఘం అధ్యక్షులు బడే శ్రీరాములు నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కళా ఆసుపత్రి అధినేత డాక్టర్ పివి రమణమూర్తి, ఆత్మీయ అతిథిగా జివిఎంసి జోన్–2 కమిషనర్ పల్లి నల్లనయ్య పాల్గంటారని చెప్పారు. ఏకపాత్రాభినయ పోటీలతో పాటు, భక్త అంబరీశ (రాజాం) శ్రీరామంజనేయ యుద్ధం (అనంతపురం), గయోపాఖ్యానం (తూర్పుగోదావరి జిల్లా) పౌరాణిక ఘట్టాల ప్రదర్శనలు ఉంటాయన్నారు.

మూలకు చేరిన ఇన్వెర్టర్లు


గిరిజన విద్యార్థులకు తప్పని చీకటి కష్టాలు

పట్టించుకోని ఐటిడిఎ, గిరిజన సంక్షేమ అధికారులు

ప్రజాశక్తి-జి.మాడుగుల

విద్యుత్ అంతరాయం సమయంలో విద్యార్థుల చదువుకు అంతరాయం లేకుండా ఉండాలన్న ఉద్దేశంతో మన్యంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు ప్రభుత్వం2014లోనే ఇన్వెర్టర్లను ప్రభుత్వం అందజేసింది. కొన్నాళ్లపాటు ఇవి సక్రమంగా పనిచేసినా, తర్వాత రోజుల్లో నిర్వహణాలోపంతో పాటు మరమ్మతులకు గురవ్వడం వంటి కారణాలతో ఇవి మూలకు చేరాయి. దీంతో ప్రభుత్వం ఆశించిన లక్ష్యం దూరమవ్వగా, కరెంట్ పోతే ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులు కారుచీకటిలోనానా అవస్థలు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఆశ్రమ పాఠశాలలకు విద్యార్థులకు విద్యుత్ వెలుగులు కల్పించాలనే ఉద్దేశంతో ఇన్వెర్టర్‌లను ఐటిడిఎ ద్వారా ప్రభుత్వం సరఫరా చేసింది. పాఠశాలలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడినప్పుడు వీటి వెలుగులో విద్యార్థులు చదువుతారనే ఉద్దేశంతో సంబంధిత ఆశ్రమ పాఠశాలల హెచ్ఎంలకు అందించారు. ఏడాది, ఏడాదిన్నర వరకు బాగా పనిచేసినప్పటికీ అప్పటి నుంచి మొరాయించాయి.. ఇవి పాడవ్వడం వల్ల రాత్రివేళల్లో కరెంట్ పోతే, చదవడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ఆశ్రమ పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులకు మరింత ఇక్కట్లు తప్పడం లేదు. జి.మాడుగుల మండలంలో పది ఆశ్రమ పాఠశాలల్లో ఇన్వెర్టర్‌లు సరఫరా చేశారు. అయితే ఆయా పాఠశాలల్లో ఎక్కడా ఇన్వెర్టర్‌లు పనిచేయలేదు. ఇవి మూలకు చేరాయి. వీటి మరమ్మతులు, నిర్వహణకు ఐటిడిఎ పరంగా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఫలితంగా ఇవి నిరుపయోగంగా మారాయి. విలువైన బ్యాటరీలు మూలనపడ్డాయి. వెంటనే మరమ్మతులు చేయకపోతే పూర్తిగా పనికిరాకుండా పోయే అవకాశం ఉందని భావిస్తున్నారు. వేసవి, వర్షాకాలాల్లో కరెంట్‌కు అంతరాయం ఏర్పడిన పరిస్థితుల్లో ఈ ఇన్వెర్టర్లు పనికిరాకుండా పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఇవి పనికిరాని స్థితిలో ఉన్నా ఎటిడబ్ల్యుఒ, అప్పటి డిడి పిఒ దృష్టికి తీసుకెవెళ్లినా సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టలేదని పలువురు ఆరోపిస్తున్నారు.



ఆశ్రమ పాఠశాలలో ఉన్న నిరుపయోగంగా ఉన్న బ్యాటరీలు

ఎటిడబ్ల్యుఒ వివరణ

దీనిపై జి.మాడుగుల ఎటిడబ్ల్యుఒ తిరుపాల్ వివరణ కోరగా ఆశ్రమ పాఠశాలలో ఈ సమస్య డిడి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. వీటికి ప్రతిపాదనలు పంపామని, త్వరలో బాగుచేస్తామన్నారు.



సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న గిరిజనులు

పాములపుట్టుకు రహదారిని నిర్మించాలని ఆందోళన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ

మండలంలోని కితలంగి పంచాయతీ పరిశీల నుంచి పాములపుట్టు వరకు రహదారిని నిర్మించాలని సిపిఎం అరకు డివిజన్ కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యాన పాములపుట్టులో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గ్రామంలో సుమారు 40 కుటుంబాలు ఉండగా 150 మంది గిరిజనులు ఉన్నారన్నారు. ఆ గ్రామంలో రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.. గ్రామస్తులు అత్యవసర సమయంలో వైద్యం కోసం ఆసుపత్రికి తరలించాలన్నా రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు.

పరిశీల నుంచి పాములపుట్టుకు కిలోమీటరు దూరం ఉందని, అయినా రోడ్డు నిర్మించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కె.దయానిధి, పంచాయతీ కార్యదర్శి సింహాద్రి, మహేష్, గిరిజనులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సన్నిబాబు

సిపిఎం జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పెదబయలు

జనవరి 6,7,8 తేదీల్లో నిర్వహించే సిపిఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి బొండా సన్నిబాబు కోరారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను, నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్యుతాపురంలో మూడు రోజుల పాటు ఈ మహాసభలు జరుగుతాయన్నారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మహాసభల్లో చర్చించి, భవిష్యత్ పోరాటాలపై కార్యాచరణ రూపొందిస్తారన్నారు. సిపిఎం నాయకులు, ప్రజా, గిరిజన సంఘాల నాయకులు, మేధావులు, గిరిజనులంతా హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.శరభన్న, కె.కోమటి, బి.గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమిని విజయవంతం చేయండి

పెదబయలు రూరల్ : ఈ నెల 2 నుంచి జరిగే జన్మభూమి కార్యక్రమాల విజయవంతానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని గిరిజన సంక్షేమ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వేణుగోపాలరావు అన్నారు. ఆదివారం మండలంలో పర్యటించిన ఆయన, స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో నిర్వహించే జన్మభూమి కార్యక్రమం షెడ్యూల్‌ను తెలియజేశారు. జనవరి 2న పోయిపల్లి, బొండాపల్లి, లక్ష్మీపేట, అడుగులపుట్టు, 3న గోమంగి, గుల్లెలు, గంపరాయి, గలగండ, 4న జామిగుడ, గిన్నెలకోట, రూడకోట, కొరవంగి, 5న అరడకోట, వనభంగి, బొంగరం, లింగేటి, 6న కిముడుపల్లి, పెదకోడాపల్లి, కుంతుర్ల, 9న ఇంజెరి, సీతగుంట, 10న సీకరి, పర్రెడ గ్రామాల్లో జన్మభూమి గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాలు ఎంపిడిఒ, తహశీల్దార్ల నేతృత్వంలో బృందాలు గ్రామాల్లో పర్యటించి, జన్మభూమి గ్రామసభలను నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో మండల స్థాయి అధికారులంతా పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో...



మాట్లాడుతున్న ఎస్‌డిసి వేణుగోపాలరావు

ఈ నెల 2 నుంచి మండలంలో జరగనున్న జన్మభూమి మావూరు కార్యక్రమానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని స్థానిక ఆ పార్టీ మండల అధ్యక్షులు టి.సుబ్బారావు కోరారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమంలో కొత్త పింఛన్లు, అర్హులైన వారిని రేషన్ కార్డులను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. ప్రతి పంచాయతీలో జరిగే జన్మభూమి కార్యక్రమానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి మండల నాయకులు ఎం.స్వామి, తదతరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి జలపాతం వద్ద ఆరు సిసి కెమెరాల ఏర్పాటు

జి.మాడుగుల : జి.మాడుగుల మండలం కొత్తపల్లి జలపాతం వద్ద ఆరు సిసి కెమెరాలను ఏర్పాటుచేశారు. పాడేరు ఐటిడిఎ నుంచి అధికారులు వచ్చి కొత్తపల్లి ప్రవేశ ద్వారం నుంచి జలపాతం వరకు ఆరు చోట్ల కెమెరాలను ఏర్పాటుచేశారు. సిసి కెమెరా దృశ్యాలను రికార్డ్ చేసేందుకు ఓ గదిని నిర్మించారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఈ కెమెరాలు ఉపయోగపడతాయని టిడబ్ల్యు అధికారులు చెప్పారు. రాత్రిపూట వచ్చే వ్యక్తులను గుర్తించేందుకు వీలవుతుంది.

థామస్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశకి-హుకుంపేట

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని హుకుంపేట థామస్ చర్చిలో ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పాస్టర్‌లు ఫెలోషిప్, జేమ్స్ ఆధ్వర్యంలో క్రైస్తవులు నూతన సంవత్సరం అందరికీ అన్నివిధాలుగా బాగుండాలని ఏసుక్రీస్తును ప్రార్థించారు.



నిలిచిపోయిన రైతుబజార్ నిర్మాణ పనులు

నత్తనడకన రైతుబజారు నిర్మాణం

ప్రజాశక్తి-అరకు రూరల్

మండల కేంద్రం అరకులోయ వాలీబాల్ మైదానం ఎదురుగా నిర్మిస్తున్న రైతు బజార్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిర్మాణ పనుల కోసం సుమారు రూ.60 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. నిధులు మంజూరై ఏడాది కావస్తున్నా పనులు మాత్రం పూర్తి కావడం లేదు. దీంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతు బజార్ పూర్తికాకపోవడంతో వ్యాపారులు తమ దుకాణాలను రహదారికి ఇరువైపులా ఏర్పాటుచేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం అవుతోంది. నిత్యం పర్యాటకులతో రద్దీగా ఉండే అరకులోయలో ట్రాఫిక్ సమస్య వేధిస్తున్న విషయం తెలిసిందే. తక్షణమే అధికారులు స్పందించి రైతు బజార్ నిర్మాణ పనులను పూర్తిచేసి, రహదారి పక్కనున్న దుకాణాలను అందులోకి మార్చే చర్యలు చేపట్టాలని, తద్వారా ట్రాఫిక్ సమస్యను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

బాలికల ఆశ్రమ పాఠశాలలపై పర్యవేక్షణ కరువు

కానరాని ఎటిడబ్ల్యుఒ తనిఖీలు

అత్యాచారం జరిగిన పాఠశాలపై కన్నెత్తి చూడని వైనం

అధికారుల నిర్లక్ష్యంపై నిరసనల వెల్లువ

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు

ముంచంగిపుట్టు మండలంలో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో విద్యార్థినులకు రక్షణ లేకుండా పోతోందని అంటున్నారు. మండల కేంద్రంలో రెండు బాలికల ఆశ్రమ పాఠశాలలుండగా, పనసపుట్టు, బంగారుమెట్ట, కిలగాడ, కెజిబివి బాలికల ఆశ్రమ పాఠశాలలున్నాయి. వీటిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన ఎటిడబ్ల్యుఒ పట్టించుకోకపోవడంతో మెనూ అమలు, విద్యార్థుల బాగోగులు పట్టించుకునే దిక్కు లేదు. ముంచంగిపుట్టు మండల కేంద్రంలోని బాలికల పాఠశాల-2లో పదవ తరగతి విద్యార్థినిపై ఇటీవల అత్యాచారం జరిగినా ఆ పాఠశాలవైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదు. 26వ తేదీ మంగళవారం విద్యార్థినిపై అత్యాచారం జర్గగా, అంతకుముందు ఆదివారం నుంచి పాఠశాలలో బాధిత విద్యార్థిని లేకపోయినా కనీసం హెచ్ఎం, వార్డెన్‌లు ఆమె ఎక్కడికి వెళ్లిందనే విషయంపై ఆరా తీయలేదు. కనీసం అత్యాచారం జరిగిన తరువాత కూడా ఈ ఘటనపై అధికారులెవరూ స్పందించికపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

ఇప్పటికే మన్యంలో విద్యార్థినులపై వేధింపులు, అత్యాచారాలు అధికమవుతున్నా ఐటిడిఎ , గిరిజన సంక్షేమ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో గిరిజన ఆశ్రమ పాఠశాలలలో విద్యార్థినులకు రక్షణ కరువైందనే ఆందోళన వ్యక్తమౌతోంది. బాలికల ఆశ్రమ పాఠశాలలో హెచ్ఎంలు, వార్డెన్‌లు రాత్రి వేళల్లో పాఠశాలలో ఉండకుండా, ఇళ్లకు రాకపోకలు సాగిస్తుండడం వల్లే ఈ దుస్థితి దాపురించిందని, అయినా దీనిపై ఎటువంటి స్పందన, చర్యలు లేకపోవడం విడ్డూరమని పలువురు అంటున్నారు. దీంతో అత్యవసర సమయాల్లో తోటి విద్యార్థినులే తోడై ఆసుపత్రులకు వెళ్తున్నారన్న ఆరోపణలున్నాయి. కొన్ని రోజులుగా హెల్త్ అసిస్టెంట్‌లు దీక్షల్లో ఉండడం కూడా ఆశ్రమ పాఠశాలల్లో పరిస్థితి మరింత ఘోరంగా మారడానికి కారణమని పలువురు అంటున్నారు.

మరోవైపు పాడేరు నుంచి ఉన్నతాధికారులు ముంచంగిపుట్టు మండలానికి ఆశ్రమ పాఠశాలల్లో తనిఖీలకు వస్తున్నారంటే ఆ సమాచారం ముందుగానే హెచ్ఎం, వార్డెన్‌లకు తెలిసిపోవడం, ఆ రోజు పాఠశాలల్లో విధుల్లో ఉండడం, మెనూ సక్రమంగా అమలు చెయ్యడం జరుగుతుంది. తరువాత షరామామూలే అవుతుంది. దీంతో విద్యార్థుల సమస్యలు బయటకు రావడం లేదు. ఇప్పటికైనా ఎప్పటికప్పుడు ఎటిడబ్ల్యుఒ పాఠశాలలపై పర్యవేక్షణ జరిపి విద్యార్థినులకు పూర్తిస్థాయి రక్షణ కలిగేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోతే వేధింపులు, అత్యాచారాలు మరింత పెరిగేందుకు ఆస్కారం ఉందని పలువురు భావిస్తున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖపట్నం
సోమవారం 1
జనవరి 2018

గ్రీటింగ్ శకం కనుమరుగు



కోటవురట్లలో ఖాళీగా కూర్చున్న చిరు వ్యాపారి

ఆధునిక టెక్నాలజీతోనే శుభాకాంక్షలు వెలవెలబోయిన గ్రీటింగ్ దుకాణాలు

సందడి లేదు.. వ్యాపారం లేదు...



గతంలో నూతన సంవత్సరం వచ్చిందంటే చాలు పది రోజుల నుంచి విద్యార్థులు, ఉద్యోగులంతా గ్రీటింగ్ కార్డుల కోసం వచ్చేవారు. ముందుగా ఆర్డర్ చేసి మరీ మంచి గ్రీటింగ్ కార్డులను కొనుగోలుచేసేవారు. ఇప్పుడు రోజులు మారాయి. పట్టుమని పది గ్రీటింగ్‌లు కూడా అమ్ముడవ్వడం లేదు. దీంతో దుకాణాల వద్ద సందడి లేదు, వ్యాపారమూ లేదు.

- ఇస్మాయిల్,
గ్రీటింగ్ దుకాణదారుడు, కోటవురట్ల..

కోటవురట్ల : ఒకప్పుడు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు గ్రీటింగ్ కార్డు కొనుగోలుకు వారం రోజుల ముందుగానే స్టాల్స్‌కు వెళ్లి గంటల తరబడి కార్డులు ఎంపిక చేసుకునేవారు. రకరకాల స్కెచ్ పెన్నులతో పాటు కార్డుల కొనుగోలుకు దుకణాలు కిటకిటలాడేవి. అయితే ప్రస్తుతం కార్డుల శకం ముగిసిపోయింది. స్మార్ట్‌ఫోన్‌ల రాజ్యమేలడంతో ఎస్‌ఎంఎస్‌లు, వాట్సప్‌లు, ఫేస్‌బుక్‌లతో పాటు విదేశాల్లో ఉన్న వారితో సైతం వీడియో కాల్స్ ద్వారా ఆధునిక పరిజ్ఞానానికి అలవాటుపడ్డారు. గడిచిన నాలుగైదు ఏళ్లుగా గ్రీటింగ్ కార్డుల విక్రయాలు క్రమేపీ తగ్గిపోగా ప్రస్తుతం అసలు ఆ ఊసే కనిపించడం లేదు. గతంలో నూతన సంవత్సరం వస్తుంటే పది రోజుల ముందుగానే పట్టణాల్లో, గ్రామాల్లో ప్రత్యేకంగా టెంట్‌లు వేసి మరీ అమ్మకాలు చేసేవారు. పోటీ ప్రపంచంలో అంతా మారిపోయింది. గ్రీటింగ్‌లను కొనుగోలు చేసేవారూ, అమ్మేవారు కరువయ్యారు. ఆధునిక టెక్నాలజీతో చెప్పే శుభాకాంక్షలు పలుకరింపులు డిలెట్ చేస్తే పోతాయి. అదే ఇచ్చే గ్రీటింగ్‌లు మాత్రం పదిలంగా ఉంటాయి. గ్రీటింగ్ కార్డులు కనుమరుగైపోవడం చాలా బాధాకరమని పలువురు అంటున్నారు. సుమారు 60 సంవత్సరాల చరిత్ర గల గ్రీటింగ్స్‌కార్డులు అంతరించుకు పోవడంపై పలువురు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా ప్రత్యేక స్టాల్స్‌తో గ్రీటింగ్ కార్డుల విక్రయాలు ప్రస్తుతం లేకపోవడంతో దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నర్సీపట్నంలో వెలవెలబోయిన షాపు

నర్సీపట్నం రూరల్ : ఈ సంవత్సరం పూల బొకేలు, కేకులు, రంగులు, ధరలు పెరగడం, సోషల్ మీడియా హవా సాగుతుంది. కొనుగోలుదారులు లేక వ్యాపారాలు పడిపోయాయి. పువ్వులు ధరలు అధికం కావడం వల్ల దుకాణాల్లో పనిచేసే సిబ్బంది జీతాలు పెంచడంతో నిర్వహణ వ్యయం పెరిగి మునపటి కంటే ఇప్పుడు స్వల్పంగా ధరలు పెంచడం జరిగింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్లలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకోవటంతో సగానికి పైగా వినియోగదారులు తగ్గారు. ఉదయం షాపుల్లో వినియోగదారులు లేకపోవడంతో ఖాళీగా ఉన్నాయి. సాయంత్రం 5 గంటలు దాటిన తర్వాత నుండి పల్చగా వినియోగదారులు వస్తున్నారు.

సంతోషంగా గడుపుకునే రోజు



ప్రజాశక్తి-పాడేరు

కుల, మత, జాతి, వర్ణ, వర్గ, లింగ భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ సంతోషంగా గడుపుకునే రోజు జనవరి ఒకటి. చేదు అనుభవాలను, జ్ఞాపకాలను పక్కకు నెట్టి నూతన జీవితాన్ని ఆరంభించేందుకు ప్రతి ఒక్కరూ సంసిద్ధమయ్యే రోజు ఇది. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రతి ఒక్కరూ భారీ స్థాయిలో వేడుకలు జరుపుకుంటారు. విశాఖ మన్యంలో ఈ వేడుకలను యువత, చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ సంతోషంగా గడుపుతారు. ఈ ఏడాది కూడా నూతన సంవత్సర వేడుకలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తిచేశారు. ప్రతి గ్రామంలో యువత వారి వారి శక్తి సామర్థ్యాల మేరకు సంబరాలు చేసుకునే పనిలో పడ్డారు. కేక్‌లను కట్ చేసుకొని స్నేహితులకు తినిపించడం, బండరాళ్లు, రోడ్లపై నూతన సంవత్సర శుభాకాంక్షలని రాయడం, స్నేహితులకు, బంధువులకు ఫోన్‌లో ఎస్‌ఎంఎస్‌లు పంపుకోవడం, ఇళ్ల ముందు అందమైన ముగ్గులు వేసి నూతన సంవత్సర శుభాకాంక్షలని రాయడం వంటివి మన్యంలో అధికంగా చేస్తుంటారు. ఆదివారం పాడేరు పట్టణం ప్రజలతో కిక్కిరిసింది. ఫ్లవర్ బొక్కేలు, గ్రీటింగ్స్, పండ్లు కొనుగోలు, నూతన వస్త్రాలు కొనుగోలుతో మెయిన్ రోడ్డంతా పండగ వాతావరణం నెలకొంది. మితిమీరిన సంబరాల వల్ల అనార్థాలు జరిగే అవకాశాలు ఉండడంతో పోలీసుల సంబరాలపై కొన్ని సంవత్సరాలుగా ఆంక్షలు విధిస్తూ వస్తున్నారు. ఏదేమైనా కొత్త సంవత్సరాన్ని సంతోషంగా గడుపుకునేందుకు ప్రజలంతా ఆసక్తి కనబరుస్తుంటారు.





అద్భుతం

పెన్సిల్ ముల్లుపై 2018
వెంకటేష్‌కు పలువురి అభినందన
గిన్నీస్ రికార్డులో చోటు

ప్రజాశక్తి-నక్కపల్లి

చినదొడ్డగల్లు గ్రామానికి చెందిన గిన్నిస్‌బుక్‌లో స్థానం పొందిన గట్టెం వెంకటేష్ నూతన సంవత్సరం పురస్కరించుకుని మరో అద్భుత కళాకండాన్ని రూపొందించాడు. పెన్సిల్ ముల్లుపై 2018 అనే అక్షరాలను తీర్చిదిద్దాడు. రాబోయే సంవత్సరానికి తన ప్రత్యేకతతో స్వాగతం పలికాడు. ఒక గంట వ్యవధిలో ఈ కళాకండాన్ని చెక్కినట్లు వెంకటేష్ తెలిపాడు. వెంకటేష్ ఇప్పటికే సూక్ష్మ కళాకారుడుగా పేరు తెచ్చుకున్నారు. అనేక సూక్ష్మ కళాకండాలను తన చేతితో చెక్కి ప్రజలు మన్ననలు పొందాడు. గిన్నీస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించాడు.





మత్తు పానీయాలకు దూరం కండి

కొత్త సంవత్సరానికి హాకీ క్రీడాకారులు, విద్యార్థులు వినూత్నంగా స్వాగతం

ప్రజాశక్తి-నక్కపల్లి

నూతన సంవత్సర వేడుకల్లో మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని హాకీ క్రీడాకారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. నక్కపల్లిలో ఏర్పాటు చేసిన బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొల్నాటి తాతాజీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా యువత చెడు అలవాటులకు దూరంగా ఉండాలని నినాదాలు చేశారు. మత్తు పానీయాలు సేవించి ఆరోగ్యాలను పాడు చేసుకోవద్దన్నారు. నూతన సంవత్సరం ఎంతో ఆనందంగా, సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.

హాకీ స్టిక్స్‌తో వినూత్నం

నూతన సంవత్సరానికి 2018 అంకె రూపంలో హాకీ స్టిక్స్‌ను వరస క్రమంలో ఉంచి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు.



హాకీ స్టిక్స్‌తో హ్యాపీ న్యూ ఇయర్



నవ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లాకు ఉజ్వల భవిష్యత్తును ఆక్షాంకిస్తూ.. నేతలు, అధికారులు తమ అభిమతాలను ఇలా వెలిబుచ్చారు. ప్రజలకు మంచి జరగాలని అభిలాషించి, కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

నవ వసంతం.. నవ సంకల్పం

ఆదర్శవంతమైన నిర్ణయాలు



కొత్త సంవత్సరంలో ప్రజలంతా ఆదర్శవంతమైన నిర్ణయాలు తీసుకొని విజయం సాధించాలి. ప్రతి ఒక్కరికీ కొత్త సంవత్సర శుభాకాంక్షలు.

- సిహెచ్ అయ్యన్నపాత్రుడు,
రాష్ట్ర రోడ్లు భవనాల శాఖామాత్యులు

విలువైన జీవితాన్ని సార్థకం చేసుకోవాలి



పోలీసుల జీవితం చాలా విలువైనది. చిన్న సమస్యలకు ఆత్మహత్యలు చేసుకోకుండా సమస్యకు పరిష్కారం చూసుకోవాలి. పెద్దలతో మాట్లాడి సమస్య నుంచి బయటపడాలి. తాగి డ్రైవింగ్ చేయకూడదు. ప్రమాదాల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యార్థులు వార్షిక లక్ష్యాన్ని పెట్టుకొని చదవాలి. చెడు అలవాట్లకు లోనుకాకుండా చదువుకొని ఉపాధి పొందాలి. పాత కక్షలు మానుకొని కలిసి బతికి ఒకరికొకరు సహాయపడాలి. పోలీసులు పరంగా మరింత స్నేహంగా వ్యవహరిస్తాం. ప్రజలకు చేరువవుతాం.

-రాహుల్‌దేవ్ శర్మ
ఎస్‌పి,.


నూతన సంవత్సర శుభాకాంక్షలు



ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలి. అందరికీ 2018 నూతన సంవత్సర శుభాకాంక్షలు.

-ప్రవీణ్‌కుమార్,
కలెక్టర్

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



నూతన సంవత్సరంలోనైనా ప్రజా సమస్యలను పరిష్కరించాలి. నిర్వాసితులు, రైతులు, కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించాలి. ప్రపంచీకరణలో భాగంగా అంతా ఒకటి కావాలని కోరుకుంటూ ప్రపంచ పండగను వ్యతిరేకించడం సరికాదు. ప్రపంచమంతా సంబరాలు జరుపుకుంటున్నప్పుడు దీన్ని మనం చేసుకోరాదు అంటే ఎటు వెళ్తున్నట్లు సంకుచిత బావాలవైపా? నూతన సంవత్సరం చేసుకోవద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమే. ఇది దుర్మార్గం.

- కె.లోకనాథం,
జిల్లా కార్యదర్శి, సిపిఎం

స్వాగతం పలుకుదాం



గత సంవత్సరం జ్ఞాపకాలను నెమరువేస్తూ, కొత్త ఆశలకు ఊపిరిపోస్తూ, ఉప్పొంగిన ఉత్సాహంతో.. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదాం. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

- గంటా శ్రీనివాసరావు,
రాష్ట్ర మానవ వనరుల శాఖామాత్యులు

అందరికీ మంచి జరగాలి



ప్రభుత్వాలు ప్రజలకు మేలు చేసే పథకాలను ప్రవేశపెట్టాలి. ప్రజల మంచికై పనిచేయాలి. నూతన సంవత్సరం జరపరాదని జిఒ ఇవ్వడం సరికాదు. అందరికీ మంచి జరగాలి.

- పసుపులేటి బాలరాజు,
డిసిసి అధ్యక్షులు,
విశాఖపట్నం

ప్రజల కోసం ఆలోచించాలి



కొత్త సంవత్సరంలోనైనా ముఖ్యమంత్రి, ప్రభుత్వాలు ప్రజల కోసం ఆలోచించి, పనిచేయాలి. ఇంతకాలం కేంద్ర వద్ద మోకారిల్లిన ముఖ్యమంత్రి ఇకపై ప్రతిపక్షాలను కలుపుకుని ప్రత్యేక హోదా, పోలవరం వంటి సమస్యలపై కేంద్రాన్ని ప్రశ్నించాలి. ప్రజా సమస్యలపై పోరాడే వామపక్షాలపై అక్రమ అరెస్టులు మానుకోవాలి.

-ఎ.జె.స్టాలిన్,
సిపిఐ జిల్లా కార్యదర్శి,.

డైరీ.. ఓ జ్ఞాపకం

- జీవనయానంలో ఎగుడు దిగుడులకు సాక్ష్యం
- గతాన్ని స్మరించుకుని భవిష్యత్తును పునర్నిర్మించుకునే సాధనం


విశాఖ రూరల్ డెస్క్ : దైనందిన చర్యలను ఏరోజు కారోజు నిక్షిప్తం చేసేది డైరీ. వ్యక్తిత్వ వికాసానికి దారి చూపేది డైరీ. నిత్య జీవితంలోని సంఘటనల సమాహారం. కొన్ని మధుర జ్ఞాపకాలు, మరికొన్ని వాస్తవాలు, కొన్ని పొరపాట్లు, ఇంకొన్ని గ్రహపాట్లు.. అదే జీవితం. వీటిని నిక్షిప్తం చేసుకునేది, ఉపయోగపడేదే డైరీ. డైరీ రాయమనేది జీవితంలో ఓ థ్రిల్లింగ్ అనుభవం. ఆసక్తిని పెంచడానికి, అంతరాత్మ ప్రబోధానికి డైరీ దోహదపడుతుంది. నూతన సంవత్సరంలో డైరీని బహుమతిగా అందించడం మన సంప్రదాయం. కొత్త సంవత్సరంలో డైరీ గురించి ముచ్చట్లు ఈ కథనం.

డైరీది విశిష్ట స్థానం

డైరీకి విశిష్ట స్థానం ఉంది. కొందరు ప్రియురాలితో పోల్చితే, మరికొందరు గురువుగా కొలుస్తారు. ఈ రోజు చేసేది మరో రోజు గుర్తుండక పోవచ్చు. వాటిని గుర్తు చేసుకునే సాధనమే డైరీ. డైరీ అంతరాత్మ నివేదిక. ఒక ప్రయత్నం విఫలమైనప్పుడు దానిని యథావిధిగా రాసుకుంటే అంరాత్మ ప్రశ్నించుకోవచ్చు. లోపాలను సరిదిద్దుకునే ప్రయత్నంతో సఫలం కావచ్చు. నిత్య సంఘర్షణకు దారితీసిన పరిణామాలను పదిలంగా ఉంచడానికి డైరీలోని పుటలు తోడ్పడతాయి. జీవిత సంగ్రామంలో వ్యక్తుల ప్రోత్సాహం కంటే డైరీ సహకారమే మిన్న.


దినచర్యలే ఆత్మకథలు

జాతిపిత మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు వంటి జాతీయ నేతలు తమ దినచర్యలను ఎప్పటికప్పుడు డైరీగా నిక్షిప్తం చేసేవారు. అవే నేటి తరానికి ఆత్మకథ రూపంలో వారి జీవిత చరిత్రలుగా అందుబాటులో ఉన్నాయి. వాటిని చదవడం ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు.



చేసినవి.. చేయాలనుకున్నవి

డైరీలు రెండు రకాలుగా ఉంటాయి. చేయాలనుకున్న పనులు రాసేవి. డైరీలో చేసినవి, చేయదల్చుకున్నవి రాయాలి. డైరీ రాయడం ద్వారా మంచి చేతిరాతను పెంపొందించుకోవచ్చు. పోటీ పరీక్షలకు వెళ్లే అభ్యర్థులు, విద్యార్థులు ఏరోజు కారోజు తాము ప్రిపేర్ అయ్యే అంశాలను రాసుకుంటూ, షెడ్యూల్ నోట్ చేసుకుంటూ మంచి జ్ఞాపకశక్తిని పెంపొందిచుకోవచ్చు.



డైరీ గురించి మరికొన్ని

- డైరీ మనసుకు ప్రతి రూపం. అందులో రహస్యాలు దాచుకోవచ్చు.
- డైరీ మంచి గురువు. మనకు మంచి మార్గాన్ని బోధిస్తుంది.
- డైరీ మంచి విమర్శకుడు. మనిషి చర్యల్లో తప్పొప్పులను సమీక్షిస్తుంది.
- డైరీ మంచి సహాయకుడు. అపజయంలో లోపాలను తెలిపి విజయం వైపు నడిపిస్తుంది.

5 లక్షల పింఛన్ల మంజూరు

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-కొత్తకోట

రాష్ట్రంలో 5 లక్షల మందికి సామాజిక పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి సిహెచ్ అయ్యన్న పాత్రుడు చెప్పారు. రావికమతం మండలం టి.అర్జాపురం జడ్‌పిటిసి రాజాన శ్రీవాణికొండ నాయుడు గృహం వద్ద జరిగిన శుభ కార్యక్రమానికి మంత్రి ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అయ్యన్న విలేకర్లతో మాట్లాడుతూ, జనవరి 2 నుంచి 11వరకూ జన్మభూమి కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఇంటింటికీ టిడిపి ద్వారా సుమారు కోటీ 18లక్షల ఇళ్లను సందర్శించా మన్నారు. ఇందులో 70 శాతం ప్రజలకు పింఛన్లు , గృహ వసతి, రేషన్ కార్డులు అవసరమని తేలిందన్నారు. గతంలో సుమారు 19 లక్షల ఇళ్లను మంజూరు చేసామని తెలిపారు. మరో 25 లక్షల మంది ఇళ్లకు దరఖాస్తు చేశారని మంత్రి చెప్పారు. వచ్చే ఏడాది బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఇళ్లను పూర్తి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం 46 లక్షల మందికి పింఛన్లు అందిస్తుండగా మరో 5 లక్షల మందికి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పోలవరం పూర్తి అయితే చోడవరం, నర్సీపట్నం, కశింకోట, బుచ్చెయ్యపేట, అనకాపల్లి మండలాల్లో లక్షా 50 ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతి పక్షనేత జగన్‌కు అవగాహన లేదన్నారు.13 వేల పంచాయతీలలో 13 వేల కిలోమీటర్ల మేర సిసి రోడ్లు వేయించిన ఘనత దేశంలో టిడిపికే చెందుతుందని తెలిపారు. పార్టీలకు అతీతంగా జన్మభూమి కార్యక్రమంలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆయన వెంట జిల్లా పరిషత్ ఛైర్మన్ లాలం భవానిభాస్కర్, ఎంపిపి డి.రామకృష్ణ, టిడిపి మండల అధ్యక్షులు రాజాన కొండనాయుడు, డెయిరీ డైరెక్టర్ గెదెల సత్యనారాయణ, మండల నాయకులు కోట గోవిందరావు, వెల్లంకి మోదునాయుడు, రౌతు సత్తిబాబు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి అయ్యన్న



పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - మాడుగుల

మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు సాకేత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. జాస్తి సాకేత్ తృతీయ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం స్థానిక ఉపాధ్యాయులు ప్రకాశరావు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పోటీలు చేపట్టారు. 6,7,8వ తరగతి విద్యార్థులకు స్వచ్ఛభారత్, 9,10వ తరగతి విద్యార్థులకు నీరు, చెట్టు, పర్యావరణంపై పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి జనవరి 11న చోడవరం ప్రేమ సమాజంలో బహుమతి, ప్రశంసా పత్రాలు అందచేస్తారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ బాలామణి, చోడవరం చిత్ర కళానిలయం వ్యవస్థాపకులు సూర్యనారాయణ, మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన చిత్రలేఖనం ఉపాధ్యాయులు కొర్నాన శ్రీనివాసరావు, నాగు, గంగాధర్, నారప్పు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



హోటల్ వద్ద ఉన్న వినియోగదారులు

చోడవరంలో హోటళ్ల రద్దీ

ప్రజాశక్తి - చోడవరం

నూతన సంవత్సరం సందర్భంగా పట్టణంలో పలు హోటళ్లు కిటకిటలాడుతున్నాయి. ప్రతియేటా మాదిరిగానే డిసెంబరు 31, జనవరి 1న పట్టణంలో హోటల్స్ వెజ్, నాన్‌వెజ్‌లతో కూడిన ప్రత్యేక ప్యాకేజీలను ఆఫర్ ధరలకు విక్రయిస్తు ండటంతో ఎగబడుతున్నారు.ఉదయం నుంచి అనేక చోట్ల రోడ్లకు ఇరువైపులా రంగులు, గ్రీటింగ్ కార్డ్స్ విక్రయాలు చేపడుతుండటంతో పట్టణంలో రోడ్లన్నీ రద్దీగా మారాయి. పలు స్వీట్ స్టాల్స్, బేకరీలు జనాలతో కిటకిటలాడుతున్నాయి. స్థానిక పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించే పనిలో పడ్డారు. పట్టణంలో గల పలు వైన్‌షాపులలో మద్యం విక్రయాలు సైతం ఊపందుకున్నాయి.

3న క్యాన్సర్ వైద్య శిబిరం

ప్రజాశక్తి - మాడుగుల

ఈనెల 3న మాడుగులలో ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక వైసిపి నాయకులు వేమవరపు రామధర్మజ (పెదబాబు) తెలిపారు. స్థానిక శ్రీనివాస్ హాస్పటల్స్ సహకారంతో విశాఖకు చెందిన మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పటల్, రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాత ఎంపిడిఒ కార్యాలయం వద్ద శిబిరం నిర్వహించి స్త్రీ, పురుషులకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉదయం 9.30గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ బూడి ముత్యాలనాయుడు పాల్గొంటారని తెలిపారు.

'సిట్' నివేదికను గవర్నర్‌కు అందజేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి

సిట్ దర్యాప్తు నివేదికను రాష్ట్ర గవర్నర్‌కు అందజేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం సిపిఎం మండల స్థాయి సమావేశం అప్పా సాహెబ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న మాట్లాడుతూ, విశాఖ భూ కుంభకోణంపై దర్యాప్తు నిమిత్తం సిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు.ఈ నివేదికపై అధికారులు సందిగ్ధంలో పడ్డారని చెప్పారు. పేదలకు న్యాయం జరగాలంటే రాష్ట్ర గవర్నర్‌కు నివేదికను అప్పగించాలని కోరారు.ఈ దర్యాప్తులో 445 కేసులు బయట పడ్డాయని, ఇందులో ఐఎఎస్ అధికారులతో పాటు ప్రముఖ రాజకీయ నాయకులు ఉన్నారని తెలిపారు. వీరిపై నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవాలంటే గవర్నర్ మాత్రమే చేయగలరన్నారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్‌కు మాత్రమే నివేదికను అందించాలని, లేకుంటే పెద్దయెత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు సిహెచ్ రాజు, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకన్న


నగదు అందజేస్తున్న సర్పంచ్

చంద్రన్న బీమా పంపిణీ

ప్రజాశక్తి-కొత్తకోట

రావికమతం మండలం దొండపూడిలో బాధిత కుటుంబానికి ఆదివారం గ్రామ సర్పంచ్ జి.తాతబాబు, బీమా మిత్ర పుష్ప చంద్రన్న బీమా నగదును అందించారు. గ్రామానికి చెందిన చిట్టి మొజ్జి అబద్దం (56) అనారోగ్యం మృతి చెందాడు. కుమార్తె దంటేటి కృష్ణవేణికి రూ 5 వేల నగదును అందించారు. బీమా మిత్ర పుష్ప మాట్లాడుతూ మిగతా నగదును బ్యాంకు అకౌంటులో జమ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆచారి, ఎంపిటిసి నేతల దుర్గాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు వంట సామగ్రి అందజేత

ప్రజాశక్తి-కొత్తకోట

రావికమతం మండలం జడ్.కొత్తపట్నంలో అంగన్‌వాడీ కార్యకర్తకు వంట సామగ్రిని ఆదివారం గ్రామ సర్పంచి గాలి మహేశ్వరి అందజేసారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి రూ.5 వేల విలువైన సామాగ్రిని అందజేయాలని ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సామాగ్రిని అందచేసినట్లు సర్పంచి చెప్పారు. పంచాయతీ పరిధిలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.20 వేల విలువైన సామగ్రిని సమకూర్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు గాలి రమణబాబు, ఎంపియుపి పాఠశాల హెచ్ఎం రామయ్య, తదితరులు పాల్గొన్నారు.


సామగ్రిని ఇస్తున్న సర్పంచి

అట్రాసిటీ కేసుపై విచారణ

ప్రజాశక్తి - చోడవరం

జన్నవరం సర్పంచ్‌పై దాడి చేసిన ఘటనకు సంబంధించి ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసును డిఎస్‌పి వివేకానంద ఆదివారం గ్రామంలో విచారణ చేపట్టారు. సర్పంచ్ లక్కవరపు కోటేశ్వరరావుపై అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు దాడి చేశారు. అతని ఫిర్యాదు మేరకు ఎస్‌సి ఎస్‌టి కేసు నమోదు చేయడంతో డిఎస్‌పి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డిఎస్‌పి పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతూ, చోడవరం సర్కిల్ పరిధిలో గతంలో వడ్డాది, గంటికొర్లాం, చీడికాడ మండలంలో కొనాం తదితర చోట్ల ఎస్‌సి ఎస్‌టి కేసులపై విచారణ చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిఐ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఎస్‌పి వివేకానంద

వ్యవసాయ పనుల్లో రైతుల నిమగ్నం

ప్రజాశక్తి,మాడుగుల

వ్యవసాయ పనులలో మండలంలోని రైతులు పూర్తిగా నిమగ్నమయ్యారు. ఖరీఫ్ వరి పంట చివరి దశకు చేరుకోవడంతో వరి కోతలు, నూర్పిళ్ల తదితర పనులతో రైతులు బిజిబిజీగా ఉన్నారు. ఈ ఏడాది వరి పంట ఆశాజనకంగా పండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో వరి కోతలు, నూర్పులు జరుగుతున్నాయి. ఒకేసారి పనులు జరుగుతుండటంతో కూలీల కొరత ఏర్పడింది. వరి నూర్పిళ్ల యంత్రాలకు సైతం విపరీతమైన డిమాండు ఏర్పడింది. రబీకి అవసరమైన పంటలు వేసేందుకు సైతం రైతులు నిమగ్నమయ్యారు. వరి నారుమడులు సిద్ధం చేస్తుండగా నువ్వులు, అపరాలు వేసేందుకు సైతం దుక్కులు మొదలు పెట్టారు. నువ్వులు, పెసలు, మినుములు, కొమ్ముశెనగ, ఉలవలు, నువ్వులు వంటి పంటలు వేసేందుకు రైతులు పనులు ప్రారంభించారు. వరి నూర్పు చేసే ట్రాక్టరుకు గంటకు రూ.800 చొప్పున వసూలు చేస్తుండగా, కూలీలను ట్రాక్టర యజమాని తీసుకు వస్తే గంటకు రూ.1600 తీసుకుంటున్నారు.


వరి కుప్పలు పెడుతున్న రైతులు

టిడిపి ప్రచార సభలుగా 'జన్మభూమి'

అఖిలపక్షం నాయకుల విమర్శ

ప్రజాశక్తి- అనకాపల్లిటౌన్

జనవరి 2వ తేదీ నుండి ప్రారంభం కానున్న జన్మభూమి, మాఊరు కార్యక్రమం టిడిపి ప్రచార సభలుగా మార్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తుందని అఖిలపక్షం విమర్శించింది. స్థానిక కొడుగంటి గోవిందరావు భవనంలో ఆదివారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో సిపిఎం నాయకులు ఎ.బాలకృష్ణ, సిపిఐ నాయకులు వైఎన్ భద్రం, ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్‌బాబు, బిఎస్‌పివి నాయకులు సూదికొండ మాణిక్యాలరావు, రైతు సంఘం నాయకులు కోరిబిల్లి శంకరరావు తదితరులు మాట్లాడుతూ, రాజ్యాంగంలో 73-74 సవరణల ద్వారా ప్రజలకు జవాబుదారిగా జరగాల్సిన గ్రామ సభల


మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు

వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాలు ఇస్తామని ప్రలోభపెట్టి అధికార టిడిపి 2018లో జరిగే ఎన్నికలకు సన్నద్ధం అయ్యేందుకు ప్రచార సభలుగా మారుస్తుందని విమర్శించారు. గతంలో జరిగిన జన్మభూమి సభల్లో పేదలు పెట్టుకున్న దరఖాస్తులకు ఇప్పటి వరకు ఎటువంటి స్పందన లేదని హెద్దేవా చేశారు. వాటికి ఈ సమావేశంలో అయినా పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల అమలులో వివక్షత లేకుండా అన్ని వర్గాల వారికి అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎలక్ట్రికల్ వర్కర్లకు ఇళ్లను కేటాయిస్తాం

ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

ప్రజాశక్తి- అనకాపల్లిటౌన్

ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్ల కుటుంబాలకు ఇళ్లను కేటాయిస్తామని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. సత్యనారాయణస్వామి దేవస్థానం మామిడితోటలో ఆదివారం నిర్వహించిన ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అనకాపల్లి నియోజకవర్గానికి సిఎం చంద్రబాబు అధికంగా ఇళ్లను కేటాయించారని, అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎలక్ట్రికల్ సంఘం భవన నిర్మాణానికి శారదానది ఒడ్డున అన్నమయ్య పార్కు పక్కన 10 సెంట్ల స్థలాన్ని కేటాయిస్తున్నట్లు తెలిపారు. రూ.5లక్షల నిధులతో సంక్రాంతి తరువాత పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఎలక్ట్రికల్ కార్మికులంతా చంద్రన్న బీమాలో చేరాలని ఆయన కోరారు. నియోజకవర్గ పరిధిలో విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు రూ.10లక్షల చొప్పున సహాయం చేసిందని తెలిపారు. అంతకు ముందు ఎన్‌టిఆర్ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు కనికెళ్ల కోటేశ్వరరావు, తమ్మినూరి అప్పారావు, దేవస్థానం చైర్మన్ తాకాశీ ఉమామహేశ్వరరావు, మళ్ల సురేంద్ర, మాటూరి అప్పారావు, కె.సత్యనారాయణ, అనపర్తి ఆది నారాయణ, బి.చౌదరి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ

పాఠశాలలో చదరంగం పోటీలు

ప్రజాశక్తి- కశింకోట

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రగతి చెస్ అకాడమి ఆధ్వర్యంలో అండర్ 15 చదరంగం పోటీలను కస్నూరపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలకు మల్లికార్జునరావు, సుధీర్‌కుమార్ పర్యవేక్షకులుగా వ్యవహరించారు. రెడ్డ చిన్నంనాయుడు తండ్రి, కీర్తిశేషులు దేముడు జ్ఞాపకార్థం పోటీలను ఏర్పాటు చేశారు. గెలు పొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులను రిటైర్డ్ అధికారి శోభాదేవి చేతుల మీదుగా అందజేశారు. విజేతలు కుష్వంత్, గోపాలకృష్ణ, హారికలను ఉపాధ్యాయులు అభినందించారు.


విద్యార్థులతో ఉపాధ్యాయులు

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- కశింకోట


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అనకాపల్లి శాసన సభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, ఎంపిపి పంచదార్ల లక్ష్మి, మండల విద్యాశాఖాధికారి మధుసూదనరావులు యుటిఎఫ్ క్యాలెండర్, డెయిరీలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటి చైర్మన్ కాయల మురళీ, వేగి గోపీ, యుటిఎఫ్ కశింకోట మండల అధ్యక్ష, కార్యదర్శులు వి.శివప్రసాద్, రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ వేలు, సలీం, నూక అప్పారావు, శ్రీను, బాబ్జి, పోతురాజు, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

'జన్మభూమి'ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లిటౌన్

వచ్చే నెల 2వ తేదీ నుండి ప్రారంభం కానున్న జన్మభూమి, మాఊరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆదివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో మూడు టీమ్‌లను ఎంపిడిఒ, ఇఒఆర్‌డి, తహశీల్దార్లు నడిపిస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రసంగాలు ప్రతి గ్రామం లోనూ ప్రజలు తిలకించేలా స్క్రీన్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో జనవరి 7న 5కె రన్ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపిడిఒ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమిపై ప్రణాళిక

ప్రజాశక్తి- సబ్బవరం

జన్మభూమి కార్యక్రమంపై ప్రణాళికను మండల ప్రత్యేక అధికాధికారి కెవిఎస్ శాస్త్రి తెలియజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ, మండలంలోని రెండు టీమ్‌లు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పంచాయతీలో గత జన్మభూమిలో వచ్చిన సమస్యలకు పరిష్కారం తెలుపుతూ కొత్తగా వచ్చిన అర్జీలను స్వీకరిస్తామని చెప్పారు. 2న సంక్షేమ పథకాలపై చర్చ, 3న ఆరోగ్యం, మెడికల్, 4న స్వచ్ఛంధ్రప్రదేశ్, ఒడిఎఫ్, 5న విద్య, మౌలిక వసతులు, 6న ఆర్థిక వనరులు, 7న సహజ వనరులు, తాగునీరు వినియోగం, 8న వ్యవసాయం, ఉద్యానవనం, పంటలు, సబ్సిడీలు, 9న విజన్ 2020, 10న గ్రామాభివృద్ధి ప్రణాళికలు, 11న ముగింపు సభలు, నియోజకవర్గ కేంద్రాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు నిర్వహిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయా లన్నారు.


మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి శాస్త్రి

ఎంపిపి గొర్లి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, ప్రతి పంచాయతీలోను ఆయా గ్రామాల ప్రజలు పాల్గొనేటట్లు గ్రామ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీల్లో పింఛన్లు, పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఇబ్బందులు ఎదురవుతున్నాయని విశాఖ డెయిరీ డైరెక్టర్ శరగడం శంకరరావు ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకెళ్లారు. వంగలి ఎంపిటిసి యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ, తమ గ్రామంలో అర్హులైన 14 మందికి ఇంత వరకు పింఛన్లు అందలేదని ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకెళ్లారు. సబ్బవరం జన్మభూమి కమిటీ సభ్యుడు కోరాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఒంటరి మహిళల పింఛన్ల మంజూరుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ షేక్ బాబూరావు, జెడ్‌పిటిసి సత్యనారాయణ, ఇఒ ఆర్‌డి కె.సూర్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, రొంగలి దేముడు, ఆకుల గణేష్, వేపాడ సోమునాయుడు, కార్యదర్శిలు రఘుబాబు, మహాలక్ష్మినాయుడులు పాల్గొన్నారు.


అచ్యుతరావును సన్మానిస్తున్న సభ్యులు

అచ్యుతరావుకు ఘన సన్మానం

ప్రజాశక్తి- కశింకోట

యలమంచిలిలో అనాథ ఆశ్రమానికి రెండు ఎకరాల సొంత భూమిని విరాళంగా అందజేసిన అల్లవరపు అచ్యుతరావును కశింకోటలో సత్తెమ్మతల్లి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, గ్రామాల్లో సేవలకు ప్రతి ఒక్కరూ కృషి చేయా లన్నారు. అచ్యుతరావు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పి.మూర్తి, వైస్ ప్రెసిడెంట్ పి.వరలక్ష్మి, సెక్రటరి పి.రమణమూర్తి, ట్రెజరర్ మురళీ, ఎంఇఒ వి.ప్రసాద్, చంద్రరావు, మణి, విఆర్ఒ మూర్తి, ఎస్ఐ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పింఛను మంజూరు చేయరూ...

ప్రజాశక్తి- బుచ్చెయ్యపేట

చక్రాల కుర్చీకే పరిమితమై సాయం కోసం ఎదురు చూస్తున్నాడు ఓ అభాగ్యుడు. గత జన్మభూమి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నా పింఛను అందలేదని పెదపూడి గ్రామానికి చెందిన బాధితుడు వియ్యపు సోమునాయుడు ఆవేదన వ్యక్తం చేశాడు. గతంలో ట్రాలీ లారీపై క్లీనరు గా పని చేస్తుండేవాడు. 2014 సంవత్సరం మే లో అమలాపురం వద్ద తాను పని చేస్తున్న ట్రాలీ లారీ లోడుతో వెళుతుండగా విద్యుత్ వైర్లు తగల డంతో తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ ప్రమాదం లో రెండు కాళ్లు, చేయిని వైద్యులు తొలగించారు. దీంతో చక్రాల కుర్చీకే పరిమితం అయ్యాడు. పింఛను కోసం ఎన్నిమార్లు దరఖాస్తులు చేసినా ఫలితం లేక పోవడంతో ఎంపిడిఒ కార్యాలయం వద్ద కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఈ నెలలో జరిగే జన్మభూమిలో నైనా పింఛను మంజూరు చేయాలని కోరుతున్నాడు.


ఆవేదన వ్యక్తం చేస్తున్న వికలాంగుడు

మహిళలకు చీరలు పంపిణీ


ప్రజాశక్తి-దేవరపల్లి

పేదవారికి సేవ చేయడమే తమ ధ్యేయమని జిఎస్ఎన్ ట్రస్ట్ చైర్మన్ గవిరెడ్డి సన్యాసినాయుడు పేర్కొన్నారు. మండలంలోని కలిగొట్ల క్రైస్తవ ప్రార్థనా మందిరం వద్ద శనివారం 50 మంది మహిళలకు ఆయన చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేతనైనంత సేవ చేసిననాడే నిజమైన వ్యక్తిగా గుర్తింపబడ తాడని చెప్పారు. ఈ విధానాన్నే తమ ట్రస్ట్ అనుసరిస్తూ పలు సేవా కార్యక్రమాలు చేస్తుందని తెలిపారు. భవిష్యత్‌లో కూడా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం పాస్టర్ ప్రభుదాసు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు కె.అప్పలనాయుడు, సర్పంచ్ అన్నంనాయుడు, జి. నర్సింహ మూర్తి, ట్రస్ట్ సభ్యులు గేదెల జగన్నాథం, నాయుడు, బండారు సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.


పంపిణీ చేస్తున్న చైర్మన్

సిమెంట్ వరలు కొరత

మరుగుదొడ్ల నిర్మాణాలపై అధికారుల ఒత్తిడి ఇబ్బంది పడుతున్న లబ్ధిదారులు



ప్రజాశక్తి-ఎస్.రాయవరం

ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్న చందంగా మండలంలోని మరుగుదొడ్ల నిర్మాణ లబ్దదారుల పరిస్థితి ఉంది. అధికారుల ఒత్తిడితో మరుగుదొడ్ల నిర్మాణానికి పూనుకుంటే, సిమెంట్ వరలు లభ్యం కాక ఏమి చేయాలో తెలియని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలోని శివారు గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటా మరుగుదొడ్డి నిర్మాణం తప్పనిసరి చేశారు. దీంతో లబ్ధిదారులు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. ప్రతిసారి ఇలానే జరుగుతుండడంతో మొదట్లో కొంత మందకొడిగా సాగినా అధికార యంత్రాంగం, అధికారులు బాధ్యతలను పంచుకుని లబ్ధిదారులకు చైతన్యం చేయడంతో అందరూ మరుగుదొడ్ల నిర్మాణానికి పూనుకున్నారు. దీంతో సిమెంట్ వరలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. మందస్తుగా ఆర్డర్ ఇస్తే గానీ వారం రోజుల వరకు వరలు అందించలేని పరిస్థితి నెలకొంది. ఒక్క మరుగుదొడ్డికి కనీసం పది వరలు పడుతుండడంతో తయారీ దారులు డిమాండ్‌కు అనుగుణంగా తయారీ లేకపోవడంతో ఒక్కో వరకు రూ.50 నుండి రూ.75 అదనంగా రేటు పెంచారు. దీంతో లబ్ధిదారులకు 750 రూపాయలు అదనంగా భారం పడుతుంది. వరల తయారీని కొరుప్రోలు, అడ్డురోడ్డు, పెదగుమ్ములూరు, దార్లపూడి, ధర్మవరం, రాయవరం తదితర గ్రామాల్లో మాత్రమే చేపట్టడంతో మండల మొత్తానికి సరఫరా కావడం లేదు. ఈ పరిస్థితి నుండి గట్టెక్కే మార్గం లేక అధికారులు ఒత్తిడి తట్టుకోలేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.



పారిశుధ్య పనులు చేస్తున్న గ్రామస్తులు

బారుగాయంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం

మండలంలోని చినగుమ్ము, బారుగాయంలో పారిశుధ్య పనులు చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ కాకర నాగవర ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి గ్రామంలోని వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా తుప్పలు తొలగింపుతో పాటు మురుగునీటి కాల్వలను శుభ్రపరిచారు. పండుగ వేళ గ్రామం పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో ఇతర గ్రామాల నుంచి కార్మికులను తీసుకువచ్చి పారిశుధ్య పనులు చేపట్టామన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

2న ఆర్థిక మంత్రి యనమల రాక

ప్రజాశక్తి-నక్కపల్లి

జనవరి 2న ప్రారంభమయ్యే జన్మభూమి - మావూరు కార్యక్రమానికి ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణ హాజరుకానున్నట్లు ఎంపిడిఒ పిడుగు ఉమామహేశ్వరరావు తెలిపారు. నక్కపల్లి జూనియర్ కళాశాల మైదానంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం ఏర్పాట్లను ఎంపిడిఒ, ఇఒఆర్‌డి పిఎస్ కుమార్ పరిశీలించారు. జూనియర్ కళాశాల మైదానంలో సభ నిర్వహించేందుకు వేదికను ఏర్పాటు చేస్తున్నారు. త్వరగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నక్కపల్లి మార్కెట్ సమీపంలో రూ.53 లక్షలతో ఐసిడిఎస్ నూతన భవనం నిర్మించారు. మంత్రి చేతుల మీదుగా భవనం ప్రారంభిస్తారని ఎంపిడిఒ చెప్పారు.

ప్రజా భాగస్వామ్యంపై అవగాహన ఉండాలి

జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులురెడ్డి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం

జన విజ్ఞాన వేదిక ఆశయాలు - ప్రజా భాగస్వామ్యంపై అవగాహన కలిగి ఉండాలని జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశాఖ జిల్లా గౌరవాధ్యక్షులు కె.త్రిమూర్తులురెడ్డి అన్నారు. ఆదివారం అడ్డురోడ్డు ఆదర్శ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. గ్రామస్థాయిలోని ప్రజల వద్దకు జెవివి ఆశయాలను ఏ విధంగా తీసుకువెళ్లాలి, ప్రజలతో కలిసి ఏ విధంగా పనిచేయాలి, ప్రజలను జెవివిలో భాగస్వామ్యం చేసే విధానంపై కులంకషంగా అవగాహన కల్పించారు. ప్రస్తుతం విద్య, రాజకీయ అంశాలపై చర్చ జరిపారు. డిగ్రీ పరీక్షల్లో 9.4 శాతం ఉత్తీర్ణత సాధించిన బొల్లం మహేశ్వరి జన విజ్ఞాన వేదిక సభ్యురాలు కావడం స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన సూచించారు. జన విజ్ఞాన వేదికలో చేరాలనుకునే వారు 7396400123 నెంబర్‌కు ఫోన్ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సభ్యులు అండిబోయిన అపర్ణ, మాధవి, కల్యాణి, రాజేస్, నూకరాజు, జెవివి పాయకరావుపేట డివిజన్ ప్రధాన కార్యదర్శి కొలగాని వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న త్రిమూర్తులు రెడ్డి

2 నుంచి 'జన్మభూమి'

ప్రజాశక్తి-నక్కపల్లి

జనవరి 2 నుంచి 5వ విడత జన్మభూమి - మావూరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పిడుగు ఉమామహేశ్వరరావు తెలిపారు. గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించేందుకు మూడు టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి టీమ్ ఎంపిడిఒ, రెండవ టీమ్ తహశీల్దార్, మూడవ టీమ్ ఇఒఆర్‌డిలతో కూడిన అధికార బృందం షెడ్యూల్ వారీగా అయా గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. 2న నక్కపల్లి, 3న దేవవరం, రేబాక, బంగారమ్మపేట, డొంకాడ, రమణయ్యపేట, గునిపూడి, 4న కాగిత, గొడిచెర్ల, డి.ఎల్.పురం, అమలాపురం, జి.జగన్నాధపురం, గుల్లిపాడు, 5న బుచ్చిరాజుపేట, న్యాయంపూడి, దోసలపాడు, చందనాడ, పెద దొడ్డిగల్లు, ముకుందరాజుపేట, 6న చినతీనార్ల, ఎ.ఎన్.నర్సాపురం, ఉద్దండపురం, సి.హెచ్.లక్ష్మీపురం, పెదతీనార్ల, నెల్లిపూడి, 7న ఉపమాక, 8న రాజయ్యపేట, వేంపాడు, 9న బోదిగల్లం, సి.హెచ్.బి.అగ్రహారం, జానకయ్యపేట, 10న చినదొడ్డిగల్లు గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.

జన్మభూమిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

జన్మభూమి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల అధ్యక్షులు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఆదివారం అధికారులు, నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులకు పింఛన్లు, రేషన్‌కార్డులు, పక్కా గృహాలు తదితర సంక్షేమ పథకాలకు దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభలపై ప్రచారం



ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆదివారం హరిపాలెంలో గ్రామంలో ఆదివారం ప్రచారం చేశారు. ఈ ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి కాంద్రేగుల రామ సదాశివరావు మాట్లాడుతూ పార్టీ జిల్లా 22వ మహాసభలు 7, 8 తేదీల్లో అచ్యుతాపురంలో జరుగుతున్నట్లు తెలిపారు. సభల్లో పాడి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, బ్రాండిక్స్ కార్మికులకు కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలని, విద్య, వైద్యం సామాన్యులకు అందుబాటులో ఉంచాలనే అంశంపై చర్చిస్తారని తెలిపారు. సెజ్ పరిశ్రమలో పనిచేసే కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు శరగడం కన్నుంనాయుడు, జన విజ్ఞాన వేదిక మండల కన్వీనర్ బి.రామ్‌కుమార్, కాంగ్రేడుల వెంకట సూరి అప్పారావు, భీశెట్టి అమ్మునాయుడు, కుఎ.సూర్యనారాయణ, కె.రామ అప్పారావు. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సబ్ పోస్ట్‌మాస్టర్ దంపతులకు సన్మానం

ప్రజాశక్తి-నక్కపల్లి

నక్కపల్లి పోస్టల్ ఆఫీసులో సబ్ పోస్టు మాస్టర్‌గా విధులు నిర్వహించిన జయతి తిరుపతిరావు ఆదివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు తోటి సిబ్బంది తిరుపతిరావు దంపతులను ఘనంగా సత్కరించారు. నక్కపల్లి టి.సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. తిరుపతిరావు సేవలను పలువురు కొనియాడారు. బాధ్యతగా పనిచేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. అనంతరం తిరుపతిరావు దంపతులను తోటి ఉద్యోగులు, పోస్టల్ సిబ్బంది పుష్ప గుచ్చాలను అందించి, శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిపిఎంలు నరిశే దిలీప్, యర్రంశెట్టి భద్రం, సబ్ పోస్టు మాస్టర్లు కృష్ణారావు, కోటేశ్వరరావు, సుబ్బరాజు, నారాయణరావు, సింహాచలం రావు, కృష్ణ, ఐపిఒ ఉమామహేశ్వరరావు పాల్గొన్నరు.



తిరుపతిరావు దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

ఘనంగా గ్యారీ షరీఫ్ పండుగ

ప్రజాశక్తి-నక్కపల్లి

మండలంలోని పెదబోదిగల్లం గ్రామంలో ముస్లిము సోదరులు ఆదివారం గ్యారీ షరీఫ్ పండుగను ఘనంగా నిర్వహించారు. బావుటాలను ఒంటెలు, గుర్రాలపై గ్రామంలో ఊరేగించారు. ముస్లీం పెద్దలు ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమానికి వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల బాబూరావు, నియోజకవర్గం కన్వీనర్ వీసం రామకృష్ణ, ఎంపిటిసి లొడగల చంద్రరావు తదితరులు హాజరయ్యారు. గ్రామంలో పండుగ వాతావరణం కనిపించింది. ఈ కార్యక్రమంలో ముస్లీం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



ముస్లిముల పండుగలో పాల్గొన్న వైసిపి నేతలు

సంక్షేమ పథకాలలకు వారధిగా 'సాధికారమిత్ర'

అవగాహన సదస్సులో మంత్రి అయ్యన్నపాత్రుడు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి అయ్యన్న

ప్రజాశక్తి -నర్సీపట్నం

ప్రభుత్వ అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, అర్హులైన వారందరికీ పథకాలు అందించేందుకు సాధికారమిత్రలను ఏర్పాటు చేశామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆదివారం నర్సీపట్నంలో నిర్వహించిన సాధికారమిత్రల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు వినూత్న ఆలోచనతో ప్రతి 35 కుటుంబాలకు సమన్వయకర్తగా డ్వాక్రా మహిళలను సాధికారమిత్రగా నియమించారన్నారు. మొట్ట మొదటిగా మన రాష్ట్రంలోనే సాధికారమిత్ర విధానాన్ని ప్రారంభించారన్నారు. వీరు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తారన్నారు. ప్రభుత్వ పథకాల పట్ల చదువుకున్న వారికి కూడా పూర్తి అవగాహన లేని పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో సాధికారమిత్ర ఆ బాధ్యతను నిర్వర్తించి, అర్హులకు ప్రభుత్వ పథకాలను చేరవచేస్తారన్నారు.

రాజకీయాలకతీతంగా పక్షపాతానికి తావివ్వకుండా నిజమైన లబ్ధిదారులను గుర్తించి అందరికీ న్యాయం జరిగేలా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం కార్యక్రమాల అమలు తీరును సమీక్షిస్తారన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి నెలకు పదివేల ఆదాయం వచ్చేలా చేయాలన్నదే చంద్రబాబు ఆశయమని తెలిపారు. జిల్లాలో 27 వేల మందిని, నర్సీపట్నం నియోజకవర్గంలో 3110 మంది సాధికార మిత్రులను నియమించినట్లు వెల్లడించారు. విధి నిర్వహణలో ఎటువంటి ఒత్తిళ్లకు లొంగ వద్దని, ఎవరికీ భయపడవద్దని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను గూర్చి మంత్రి వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 46 లక్షల మందికి పింఛన్లు అందజేస్తున్నామని, ఈ జన్మభూమిలో మరో ఐదు లక్షలు కొత్త పింఛన్లు ఇస్తున్నట్లు తెలిపారు. ఒంటరి మహిళలకు పింఛన్లు ఇచ్చే ఆలోచన ఉన్నట్లు వెల్లడించారు. తలసేమియా బాధపడేవారికి, నపుంసకులకు కూడా వికలాంగ పింఛన్లు ఇస్తామన్నారు. గహ నిర్మాణ పథకంలో రూ.1.50 లక్షల యూనిట్ విలువగా ఇళ్లను 19 లక్షల మందికి మంజూరుచేశామని ఒక కోటి42 లక్షల మందికి రేషన్ కార్డులు ఇచ్చామని, వారందరికీ ప్రతి పండుగకు చంద్రన్న కానుకలు ఇ స్తున్నామన్నారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ఆర్థికభరోసానిచ్చే చంద్రన్న బీమా అమలు చేస్తున్నామన్నారు. నీరు-మీరు పథకంలో చెరువుల పూడికతీత, పంట కాలువల లైనింగ్ చేపట్టామన్నారు. నర్సీపట్నం నియోజవర్గంలో ఈ ఏడాది రూ.14 కోట్ల నీరు చెట్టు పనులు చేశారని, వచ్చే ఏడాదిలో రూ.16 కోట్లతో పనులు చేపడతామన్నారు.చంద్రన్న పెళ్లి కానుక, వడ్డీలేని రుణాలు మొదలైన పథకాలను గూర్చి వివరించారు. ప్రతి గ్రామంలోనూ పశుగ్రాసం కొరత లేకుండా చేసేందుకు ప్రభుత్వ పెట్టుబడితో పచ్చగడ్డి పెంచి, రైతులకు సబ్సిడీ ధరలకు సరఫరా చేస్తారన్నారు.

వెలుగు పథక సంచాలకులు సత్యసాయి శ్రీనివాస్ పాల్గొని, సాధికారమిత్రల నియామకం, వారి విధులు, బాధ్యతలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.సూర్యారావు, మెప్మా పథక సంచాలకులు పి.ప్రమీలారాణి, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి అయ్యన్నకు పుచ్చగుచ్చం ఇస్తున్న వర్మ

మంత్రి అయ్యన్నకు శుభాకాంక్షలు

నర్సీపట్నం : రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడిని, డిసిసిబి ఛైర్మన్ సుకుమార్ వర్మతో పాటు పలువురు డైరెక్టర్లు ఆదివారం నర్సీపట్నంలో కలిశారు. మంత్రికి వారంతా నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రి అయ్యన్నకు డిసిసిబి ఛైర్మన్ వర్మ పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు

ఆటోవాలాలు ఐకమత్యంతో మెలగాలి : ఎస్ఐ

ప్రజాశక్తి- నాతవరం

ఆటోవాలాలంతా యూనియన్‌గా ఐక్యమత్యతతో మెలగాలని ఎస్ఐ జి.అశోక్‌కుమార్ సూచించారు. ఆదివారం తాండవ జంక్షన్‌లో శ్రీ సిద్ధివినాయక ఆటో యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ కార్మికులకు ఏటా ఆనవాయితీగా ఇస్తున్న బోనస్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆటోయూనియన్ రూపొందించిన క్యాలెండర్‌ను ఎస్ఐ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులంతా ఐక్యతతో ముందుకుసాగితే మంచిదన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రమాదాలు గణనీయంగా తగ్గడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా చేస్తున్న నేపథ్యంలో ఆటోడ్రైవర్లు మద్యానికి దూరంగా ఉండాలని, తాగి ప్రమాదాలకు కారణం కావద్దని సూచించారు. డ్రైవర్ పక్క ముందుసీట్లో ప్రయాణికులను ఎక్కించుకోవడం నేరమన్నారు. ఆటోలకు అన్ని పత్రాలుండాలని, డ్రైవర్‌కు లైసెన్స్ తప్పనిసరన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు వెంటనే ఆర్‌టిఒ కార్యాలయాన్ని సంప్రదించి చేయించుకోవాలని, దీనిపై తోటి కార్మికులకు ఆటోయూనియన్లు అవగాహన కల్పించాలన్నారు. ఆటో యూనియన్ ప్రెసిడెంట్ వి.తాతబ్బాయి మాట్లాడుతూ తమ యూనియన్ పరిధిలో 150 వరకు ఆటోలున్నాయని, తామంతా ఐక్యంగా ముందుకు సాగుతున్నామని, ఏటా యూనియన్ సభ్యులకు బోనస్‌లు ఇస్తున్నామన్నారు.



ఆటో కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ

విజృంభిస్తున్న దోమలు ... విలవిల్లాడిపోతున్న ప్రజలు

ప్రచారార్భాటానికే దండ'గ' యాత్రలు పరిమితం
దోమల నియంత్రణకు కానరాని చర్యలు

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్

దోమలను నిర్మూలనకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'దోమలపై దండయాత్ర' దండగ యాత్రగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా రోజుల్లో ఈ విషయమై ప్రచార ఆర్భాటం చేసిన అధికారులు, నేతలు ఆ తర్వాత పట్టించుకోకపోవడంపై ఎక్కడికక్కడే దోమలు విజృంభించి, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. నర్సీపట్నం పట్టణంతో పాటు గ్రామాల్లోనూ దోమల బెడద రోజురోజుకూ అధికం కావడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సాయంత్రమైతే చాలు దోమల దండయాత్ర ప్రారంభమౌతోంది. గ్రామాల్లో, పట్టణంలోనూ కాలువలు పూడుకుపోవడం, మురుగునీరు దోమల విజృంభణకు ప్రధానకారణంగా కాగా, క్షీణించిన పారిశుధ్యం దోమలకు నిలయంగా మారుతోంది. దీనికితోడు పట్టణంలో ఎక్కడికక్కడే కొబ్బరిబొండాలు, పాత టైర్లు, చెత్తాచెదారం పేరుకుపోయి, కుక్కలు, పందులకు ఆవాసంగా మారడంతో పారిశుధ్యం క్షీణించి దోమలకు నిలయంగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఆరుబయట మలవిసర్జన కూడా అపరిశుభ్రతకు కారణమై దోమల వృద్ధికి దోహదపడుతోందనే విమర్శలున్నాయి.

దోమలనివారణకు ఒకపుడు కాలువ బ్లీచింగ్ చల్లడం, ఫాగింగ్ చేయడం, మురుగునీటి కాలువల్లోనూ, నీరు నిల్వ ఉన్నచోట దోవంల లార్వాలనం అరికట్టేందుకు గంభూషియా చేపపిల్లలను వదిలిపెట్టడం వంటి చర్యలు చేపట్టేవారు. దీంతో పాటు ప్రభుత్వపరంగా మలేరియా పీడిత గ్రామాల్లో దోమతెరల పంపిణీ చేయడంతో పాటు వాటి వినియోగంపై అవగాహన కల్పించేవారు. కానీ ఇపుడా చర్యలన్నీ అటకెక్కిపోయాయి. దోమల నియంత్రణకు తూతూ మంత్రంగానే చర్యలు చేపడుతున్నారనే ఆరోపణలున్న నేపథ్యంలో దీనిపై అధికారులు దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.



రోగాల బారిన ప్రజలు

దోమల కారణంగా పైలేరియా, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయి. జ్వరాలు, డెంగీ బారిన పడుతున్నారు. దద్దుర్లు, దురదలు, ఎలర్జీ వంటి రుగ్మతలతో అవస్థలు పడుతున్నారు. దోమల బారిన పడకుండా ఉండేందుకు దోమల బ్యాట్‌లు, మస్కిటోకాయిల్స్, పేపర్స్, లిక్విడ్స్ వంటి వాటికి అదనపు ఖర్చు భరించి, ప్రజలు వాడుతున్నా, వీటి వల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయన్న నిపుణుల హెచ్చరికలతో భయపడుతూనే వీటిని ఆశ్రయిస్తున్నారు.

దోమల విజృంభణకు కారణాలివే

మెయిన్‌రోడ్డుతో పాటు వీధుల్లో మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోవడం, ఖాళీ స్థలాల్లో పిచ్చితుప్పలు, డొంకలు ఉండటం వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి. పందుల స్వైర్యవిహారం, దోమల నివారణకు మందుల స్ప్రే చేయకపోవంతో పాటు బహిరంగ మలవిసర్జన తదితర కారణాలు దోమల విజృంభణకు కారణమౌతున్నాయి.

నివారణ చర్యలు

మురుగు కాలువల్లో దోమల నియంత్రణకు నిత్యం మందులు స్ప్రేయింగ్ చేపట్టాలి. ఫ్యాగింగ్ చేయాలి. ఖాళీ స్థలాల్లో పిచ్చి తుప్పలు తొలగించడంతో పాటు బహిరంగ మలవిసర్జన జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. మరుగుదొడ్లు వినియోగంలో ఉంచాలి. టైర్లు, ఖాళీ కొబ్బరిబొంఆలను ఎప్పటికప్పుడు ఏరివేయించాల్సి ఉంది.

భరించలేకపోతున్నాం



పగలు, రాత్రి లేకుండా దోమలు కుట్టేస్తున్నాయి. అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతోనే పట్టణంలో దోమల బెడద అధికమైంది. కావున వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలి. లేకుంటే రోగాలు ప్రబలే ప్రమాదముంది.

రొంగలి ప్రసాద్,
అకౌంటెంట్, నర్సీపట్నం



మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు మహర్షి సాగర్

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్

మండలంలోని వేములపూడి కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్ఎస్ఎ వ్యక్తిత్వ వికాస నిపుణుడు మహర్షి సాగర్ ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం కోసం రోజూ వ్యాయామం చేయాలన్నారు. చదువులో రాణిస్తేనే జీవితంలో ఉన్నతికి చేరుకోగలన్నారు. ఈ పోటీ ప్రపంచంలో ధైర్యంగా ముందడుగు వేయాలని సూచించారు. చదువులో ఎక్కువ, తక్కువ అనే వ్యత్యాసాలు రానివ్వకుండా, ఇష్టపడి అర్థం చేసుకొని చదివితేనే విజేతలుగా నిలుస్తారన్నారు. పాఠాలను అర్థం చేసుకొని చదివితే మంచి ప్రయోజనముంటుందన్నారు. పుస్తకాల్లో చదివే విషయాలకన్నా స్వతంత్రంగా నేర్చుకుంటేనే ఎక్కువ కాలం గుర్తుంటాయి అన్నారు. రానున్న పరీక్షలకు ఇప్పటినుంచే ప్రణాళికను రూపొందించుకొని, క్రమపద్ధతిలో చదివితే మంచి గ్రేడింగ్ సాధ్యపడుతుందన్నారు. ఆత్మ విశ్వాసాన్ని పెంచుకోవటం విద్యార్థుల ప్రథమ లక్షణమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారిణి కె. భవాని, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జన్మభూమి గ్రామసభల షెడ్యూల్

గొలుగొండ : మండలంలో ఈ నెల 2 నుంచి నిర్వహించే ఐదోవిడత జన్మభూమి, మవూరు గ్రామసభల షెడ్యూల్‌ను అధికారులు వెల్లడించారు. అధికారులు మూడు బృందాలుగా గ్రామాల్లో పర్యటించి, గ్రామసభలను నిర్వహించి, ప్రజల నుంచి సమస్యలను సమీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు ప్రభుత్వపరంగా మంజూరైన సంక్షేమ లబ్ధిని అర్హులకు అందజేయనున్నారు. అధికారులు ప్రకటించిన జన్మభూమి గ్రామసభల షెడ్యూల్ వివరాలివి. 2న ఎఎల్.పురం, సిహెచ్.నాగాపురం, కృష్ణాదేవిపేట, 3న కె.మల్లంపేట, కొంగసింగి, చీడిగుమ్మల గ్రామాల్లోను, 4న కె.ఎల్లవరం, సాలిక మల్లవరం, చోద్యంలోను, 5న రావణాపల్లి, గుండుపాల, జోగంపేటలోను, 6న పప్పుశెట్టిపాలెం, పాకలపాడు, అమ్మపేటల్లోను, 8న కశిమి, 9న ఏటిగైరంపేట, లింగందోరంపాలెం,పాత మల్లంపేట లోను 10న పుత్తడిగైరంపేట, కొమిర, లింగంపేట గ్రామాల్లోను, 11న గాదంపాలెంల, గొలుగొండ గ్రామాల్లోను జన్మభూమి గ్రామసభలు జరుగుతాయన్నారు.



మంత్రి అయ్యన్నకు వినతిపత్రం ఇస్తున్న కళాకారులు

స్థానిక కళాకారులకు అవకాశం కల్పించండి

నర్సీపట్నం : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడును ఆదివారం జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విశాఖ ఉత్సవ్‌లో స్థానిక కళాకారులను తీసుకోవాలని కోరారు. మంత్రికి నర్సీపట్నంలో వినతి పత్రాన్ని అందజేశారు. దీంతో మంత్రి కలుగ జేసుకొని ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వెంటనే కళాకారులను తీసుకోవాలని చెప్పినట్లు మంత్రి అయ్యన్న వారికి వివరించారు.

సరస్ ఎగ్జిబిషన్ అదుర్స్


చెక్కతో తయారు చేసిన వివిధ ఆకృతులు

★ 20 రాష్ట్రాలతో పాటు ఎపిలోని 13 జిల్లాల నుంచి ఉత్పత్తుల ప్రదర్శన
★ తినుబండారాలు నుండి విలువైన సామగ్రి వరకూ..
★ మరో మూడు రోజులే...

ప్రజాశక్తి-జిల్లాపరిషత్

జాతీయ స్థాయిలో 20 రాష్ట్రాలు, రాష్ట్రంలోని 13 జిల్లాలోని స్వయం సహాయక సంఘాలు స్వయంగా తయారు చేసిన నాణ్యమైన ఉత్పత్తులను సరస్ డ్వాక్రా బజార్ ప్రదర్శన-2017 ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానం వేదికగా ఈ నెల 22న ప్రారంభమైన ఎగ్జిబిషన్ జనవరి 3వ తేదీ వరకు 13 రోజుల పాటు విశాఖ వాసులకు అందుబాటులో ఉండనుంది. సెర్ప్, నాబార్డు, మెప్మా, జ్యూట్‌బోర్డు సంయుక్తంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రదర్శన పట్ల ప్రజలు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అన్ని రకాల ఉత్పత్తులు అందుబాటులో

ప్రదర్శనలో అన్ని రకాల డ్రైఫ్రూట్స్, హస్త కళాకృతులు, చేనేత చీరలు, డ్రెస్‌లు, వస్త్రాలు, వివిధ రకాల ఆహార పదార్థాలు, పచ్చళ్లు, అప్పడాలు, ఒడియాలు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు టేకు, వామ చెక్కతో తయారు చేసిన అలంకరణ సామగ్రి, పింగాణి ఆకృతులు, మట్టి ఆకృతులు, ప్లాస్టిక్ ఫ్లవర్ వైజ్‌లు వంటి పలు గృహోపకరణాలు, చిన్నపిల్లలు, మహిళలు, పురుషులు అన్ని రకాల వర్గాల వారికి అవసరమయ్యే రీతిలో ఉత్పత్తులు ఇక్కడి ప్రదర్శనలో ఉంచారు. వివిధ రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన సంఘాలు ప్రదర్శనలో స్టాళ్లు ఏర్పాటు చేశాయి. ఆయా ప్రాంతాల్లో పేరెన్నికగన్న, నాణ్యమైన ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా...

గ్రామీణ మహిళలు సంఘాలుగా ఏర్పడి దేశీయ పద్ధతుల్లో వివిధ రకాల వస్తువులను తయారు చేస్తున్నారు. వాటిని మార్కెట్ చేసే స్తోమత, అవగాహన లేక వ్యాపారం అంతంతమాత్రమే జరుగుతుంది. ఉత్పత్తులు బయట మార్కెట్‌తో పోల్చినప్పుడు ధర తక్కువగా ఉండటమే కాకుండా, ఎంతో నాణ్యత కలిగి ఉన్నాయి. ఇంత గొప్ప ఉత్పత్తులు బయట ప్రపంచానికి తెలియజెప్పడానికి ఈ ప్రదర్శన గొప్ప సాధనంగా పనిచేస్తుంది. గతంలో విశాఖలో ఈ ప్రదర్శన రెండు సార్లు నిర్వహించారు. సభ్యులకు ఆర్థిక భరోసా కలగడంతో ప్రదర్శనకు హాజరయ్యేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. సంఘాల ద్వారా వస్తు సామగ్రిని అమ్ముకొని కుటుంబాలను పోషించుకుంటున్నవారు కొందరైతే, దీని ద్వారానే తమ పిల్లలను ఉన్నత చదువులవైపు సాగిస్తున్న వారు మరికొంతమంది ఉన్నారు. ఇలా ప్రదర్శనల ద్వారా ఉత్పత్తుల అమ్మకాలు జరిగేలా చేయడం ద్వారా మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందేందుకు తోడ్పడుతుంది.

> **చేనేత చీరలు, నేతి మిఠాయిలు, మట్టి నగిషీలు, చెక్కతో చేసిన శిల్పాలు, రాయలసీమ రాగిసంగటి, రాజస్తాన్ రుచులు, ప్రఖ్యాత ప్రాంతాల నుండి తీసుకొచ్చిన ఉత్పత్తులు ఇలా ఎన్నో వైజాగ్‌లో కొలువయ్యాయి. అన్ని రకాల ప్రజల అవసరాలకు, ఇష్టాలకు తగ్గట్టుగా ప్రజలకు నచ్చే రీతిలో విశాఖవాసులకు ఈ వారం రోజులు అందుబాటులో ఉండనున్నాయి. విశాఖలోని ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన అఖిల భారత సరస్ డ్వాక్రా బజార్ ప్రదర్శన-2017 ఈ మేలవింపులకు వేదికగా నిలిచింది. ప్రజల అవసరాలను తీర్చడమే కాకుండా స్వయం సహాయక మహిళా సంఘాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు దోహదం చేస్తుంది ఈ సెల్ఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిజన్స్**

ప్రదర్శనలో పాల్గొనే వారికి సదుపాయాలు

అఖిల భారత డ్వాక్రా బజార్ ప్రదర్శనలో సంఘాల వారు అమ్ముకునేందుకు అవకాశం కల్పించడంతో పాటు మరెన్నో సదుపాయాలు కల్పిస్తున్నారు. ఉచితంగా స్టాళ్లు అందజేస్తున్నారు. ప్రదర్శన ఉన్నంత వరకు ఉచిత వసతి, రవాణా సదుపాయాలు కల్పిస్తున్నారు. సదుపాయాలు కల్పించడంతో అధిక సంఘాలు ప్రదర్శనలో పాల్గొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయి.

రూ.4 కోట్ల వ్యాపారమే లక్ష్యం..

గతేడాది 12 రోజుల పాటు నిర్వహించిన ప్రదర్శనలో రూ.1.40 లక్షల వ్యాపారం జరిగింది. ఈ ఏడాది 13 రోజుల పాటు నిర్వహించడంతో పాటు ఉత్పత్తులు మరిన్ని అందుబాటులోకి తీసుకురావడంతో రూ.4కోట్లు వ్యాపారం చేసే లక్ష్యంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికార యంత్రాంగం కృషి చేస్తోంది. ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించే పనిలో భాగంగా విశాఖ నగరంలో 4 ఆటోల ద్వారా ప్రచారం నిర్వహించారు. ముఖ్యమైన ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

ఇక్కడ కొనుగోళ్లకు జిఎస్‌టి లేదు

ప్రధాని మోడీ తీసుకొచ్చిన జిఎస్‌టి వల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, కార్మికులు రోడ్డున పడిన విషయం విధితమే. వ్యాపారాలు సైతం తగ్గుముఖం పట్టినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయితే డ్వాక్రా బజార్ ప్రదర్శనలో కొనుగోలు చేసే అమ్మకాలకు జిఎస్‌టి లేకపోవడం వినియోగదారులకు ఊరటిగా ఉంది. దీంతో ఇక్కడ కొనుగోళ్లకు క్యూ కడుతున్నారు.

శాశ్వత ప్రాతిపదికన డ్వాక్రా బజారు ఏర్పాటు చేయాలి

రాష్ట్ర విభజన అనంతరం విశాఖ నగరం దేశంలోనే అత్యంత ప్రాధాన్యత ఉన్న నగరంగా పేరుగాంచింది. పరిశ్రమలపరంగా, పర్యాటకంగా గొప్ప ప్రాధాన్యతను సంతరించుకుంది. నిత్యం వివిధ ప్రాంతాల నుండి సందర్శకులు వస్తుంటారు. సాధారణంగా నాణ్యమైన, సరసమైన ఉత్పత్తులు అందుబాటులో ఉంటే కొనుగోలు చేయడానికి ఇక్కడి వారు ఆసక్తి చూపిస్తారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న అఖిల భారత డ్వాక్రా బజార్ కొద్ది రోజులకే పరిమితం. ఈ రకమైన సదుపాయాలతో శాశ్వతంగా డ్వాక్రా బజారును ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆలోచన చేయాలి.

మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రదర్శన

డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు, ఉత్పత్తులకు భరోసా కల్పించేందుకే అఖిల భారత డ్వాక్రా బజార్ ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుంది. ప్రతి మహిళా నెలకు కనీసం రూ.10 వేలు సంపాదించాలనే ఆలోచకు తగ్గట్టుగా మహిళ అభ్యున్నతికి కృషి చేస్తున్నాం. ఉన్నతాధికారుల సహకారంతో ఇప్పటికి విశాఖ వేదికగా మూడుసార్లు ప్రదర్శనలు నిర్వహించాం.

-సత్యసాయి శ్రీనివాస్, డిఆర్‌డిఎ పీడీ




చీరలను పరిశీలిస్తున్న మంత్రులు పరిటాల సునీత, గంటా (ఫైల్)



స్టాల్‌లో బొంగులో చికెన్ విక్రయిస్తున్న గిరిజనులు


ప్రకృతి సిద్ధమైన వనమూలికలు


ఆత్రేయపురం వారి పూతరేకులు